# ఫాసిజం- మతం

- ప్రభాత్ పట్నాయక్
- ఐజాజ్ అహ్మద్
- ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్

320.533
ప్రభా - - ఫాసి
74770

ప్రజాశక్తి బుక్ హౌస్
కారల్‌మార్క్స్‌రోడ్, విజయవాడ-2 ఫోన్: 67792

# ఫాసిజం- మతం

- ప్రభాత్ పట్నాయక్
- ఐజాజ్ అహ్మద్
- ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్

ప్రజాశక్తి బుక్ హౌస్

కారల్‌మార్క్స్‌రోడ్, విజయవాడ-2 ఫోన్: 67792

ప్రచురణ నెం : 355
ముద్రణ : మే, 1994
ప్రతులు : 1,000

ISBN 81-86317-02-3

320.533
ప్రభా-- సో.సి.

C 10169

సుందరయ్య గ్రంథాలయ
AC 747.70
హైదరాబాద్-500 044

వెల: 5-00

కంపోజ్: ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ. అక్షరమాల, విజయవాడ.
ముద్రణ: యుగంధర్ ఆఫ్‌సెట్, విజయవాడ

ప్రజాశక్తి బుక్ హౌస్

కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2 ఫోన్: 67792

# దేశవాళీ ఫాసిజమే 'హిందూత్వ'

- ప్రభాత్ పట్నాయక్

అయోధ్య ఘటనలు, అనంతర పరిణామాలను చాలామంది మతోన్మాదం అని చెప్పడంతోనే సరిపుచ్చుకుంటున్నారు. భారతదేశంలో ఫాసిజం ఆవిర్భవించిందని చెప్పడం లేదు. మతోన్మాద మారణకాండ బొంబాయి, అహమ్మదాబాద్‌లాంటి నగరాలలో మైనారిటీలకు వ్యతిరేకంగా జరిగిన దాడులు మరింతలోతైన, దుష్టత్వంలతో కూడిన ధోరణిని, ఫాసిస్టు ధోరణిని సూచిస్తున్నదని నా అభిప్రాయం. వీటిని చెదురు మదురు ఘటనలని, తరువాత నమసిపోయేవని, కేవలం మైనారిటీలకు మాత్రమే పరిమితమైనవని భావించడానికి వీలు లేదు. ఈ దౌర్జన్య కాండ మతతత్వ స్వభావాన్ని నేను తక్కువ చేసి చెప్పడం లేదు. మతోన్మాదమనేది భారతదేశంలో ఫాసిజం రూపమన్నదే నా వాదన.

## ఫాసిస్టు దృక్పథం

హిందూత్వ ఉద్యమం ఆవిర్భవించిన తీరును సిద్ధాంతపరంగాను, సామాజిక మద్దతులపరంగాను; పద్ధతులు, కార్యక్రమపరంగాను ఫాసిజం సంప్రదాయ లక్షణాలను దాదాపు పూర్తిగా కల్గి ఉంటుంది. హిందువులు అనే ఏక సదృశ సూత్రంతో మెజారిటీ ప్రజను ఏకం చేసే ప్రయత్నం, ఏక సదృశ మైనారిటీలు, ఏక సదృశ మెజారిటీల పట్ల అన్యాయంగా వ్యవహరించారని ఆరోపించడం, మైనారిటీల కన్నా తమకు సాంస్కృతిక ఆధిక్యత ఉందని చెప్పుకోవడం, వీటికి అనుగుణంగా చరిత్రను పునర్వ్యాఖ్యానించడం, నిష్పక్షపాత పరిశీలనలో తద్విరుద్ధంగా వెల్లడైన అంశాలను, శాస్త్రీయ పద్ధతిని, హేతుబద్ధమైన చర్చకు నిరాకరించడం, ఏకసదృశమని చెప్పబడుతున్న మెజారిటీ ప్రజలను రెచ్చగొట్టడం, రక్తాన్ని వేడెక్కించే విధంగా ప్రధానంగా పురుషాహంకారాన్ని ప్రేరేపిస్తూ, 'మీరు మగవాళ్ళైనా', 'మీలో ప్రవహించేదిరక్తంకాదు, రక్తం అని నిరూపించుకోండి' మొదలైన మాటలతో దౌర్జన్యాన్ని రెచ్చగొట్టడం, ఈ విధంగా మైనారిటీలపై దౌర్జన్యకాండ జరిగేలా చేయడం - ఇటువంటి ఫాసిస్టు సిద్ధాంతంలో భాగాలన్నీ హిందూత్వంలో ఉన్నాయి.

పురోగామి సామాజిక ఉద్యమాలు సంస్థలపై దాడి చేస్తాయే తప్ప వ్యక్తులపై కాదు. సమానత్వం, సౌభ్రాతృత్వాలను సాధించడం ఈ దాడి లక్ష్యంగా ఉంటుంది. కాని ఫాసిజం ఒక గ్రూపుకు చెందిన వ్యక్తులపై దాడిని కేంద్రీకరిస్తుంది. సంస్థలపై దాడి దీనిని అనుసరించేదిగా మాత్రమే ఉంటుంది. ప్రస్తుత రాజ్య వ్యవస్థను అధిగమించాలని ఫాసిజం భావించదు. అణచివేసే, అణచివేతకు గురయ్యేవర్గాల మధ్య సంబంధాన్ని ప్రస్తుత సామాజిక వ్యవస్థలోనే,ప్రస్తుత ఆస్తి సంబంధాల పరిధిలోనే పరిమితం చేస్తుంది. మరింతమెరుగైన, సంపద్వంతమైన భవిష్యత్తుకోసం విజ్ఞప్తులు చేయదు, ద్వేషాన్ని మాత్రమే రెచ్చగొడుతుంది. తాను శత్రువుగా ఊహించుకునే వారికి ఫాసిజం చూపే దారి నిర్మూలించబడటం, లేదా బహిష్కరించబడటం, మరీ అయితే అణిగి మణిగి ఉండే గ్రూపుగా ఉండనీయడం.

జర్మనీలో నాజీ వాదానికి సంబంధించి ఇది ఎంత వాస్తవమో, ఇక్కడ హిందూత్వ ఉద్యమానికి కూడా ఇది అంతే వాస్తవం. రెచ్చగొట్టే శక్తి ప్రస్తుతం కొంత సన్నగిల్లినప్పటికీ ఈ మౌలిక సైద్ధాంతిక అంశాన్ని మనం విస్మరించరాదు. "వారి"కి వ్యతిరేకంగా 'మనం' అన్న భావనను అర్యులమన్న దానితో కూడిన హిందూమతం అన్నదాని ద్వారా ఎక్కించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది హిందువులలో సాంప్రదాయకంగా వస్తున్న విశ్వాసాలకు, అచారాలకు విరుద్ధమైనది.

## హిందూత్వ వర్గ పునాది

ఈ ఉద్యమానికి మౌలికమైన మద్దతు పెటి బూర్జువా వర్గం నుండి లభిస్తుంది. హిందూత్వ ఉద్యమంలో ప్రధాన భాగస్వామిగా ఉన్న బి.జె.పి.కి మద్దతు పట్టణ పెటి బూర్జువా వర్గం నుండి లభిస్తుంది. ఉత్తర భారతదేశంలో బి.జె.పి. తన పునాదిని భూస్వాములకు, ధనిక రైతులకు విస్తరింపచేసుకోవాలని ప్రయత్నించింది. సంపన్నరైతాంగం, పట్టణాల్లోని పెటి బూర్జువాలాంటివారే, కాని గ్రామసీమలలోని సంపన్న వర్గాలపై చరణ్‌సింగ్, ఆయన అనుయాయులకు ఉన్న పట్టు బి.జె.పి ప్రయత్నాన్ని నిరోధించింది. వాస్తవానికి చరణ్‌సింగ్ గ్రామీణ పునాదిలో ప్రవేశించడానికి బి.జె.పి. చేసిన ప్రయత్నమే 1980 లో జనతాపార్టీ ప్రభుత్వం కూలిపోవడానికి కారణం. చరణ్‌సింగ్ నాయకత్వంలోని సంకీర్ణప్రభుత్వం కూలిపోయిన తర్వాత బి.జె.పి. హిందూత్వ ఉద్యమం భూస్వామ్య, ధనిక రైతుల

మద్దతును కూడా సంపాదించింది. కాని మొత్తంగా చూసినప్పుడు బి.జె.పి. వర్గం మద్దతు పెటి బూర్జువా వర్గం (గ్రామీణ పెటీ బూర్జువాతో సహా) నుండి మాత్రమే. వ్యాపారులు, ఆఫీసు ఉద్యోగులు, దుకాణదారులు, ప్రభుత్వోద్యోగులు, పెంషన్ ఉద్యోగులు. జార్జి డిమిట్రోవ్' యునైటెడ్ ఫ్రంట్ లో చెప్పినట్లు ఇది ఫాసిజం యొక్క మరొక ప్రధాన లక్షణం.

హిందూత్వ శక్తులకు గుజరాత్ గ్రామీణ సంపన్నుల నుండి మద్దతు లభిస్తున్న విషయాన్ని జాన్ బ్రెమన్ చెప్పారు. బొంబాయి అల్లర్లలో పాల్గొన్నవారు నిరుద్యోగులు, అలగాజనం కాదు. ఏదోరకమైన ఉద్యోగం కల్గిన మధ్యతరగతి, క్రింది స్థాయి మధ్య తరగతి యువకులే. గ్రామీణ పేదలలో అత్యధికులు ఈ ఉద్యమానికి వెలుపలే ఉండటమే గమనించదగిన ఒక ముఖ్యమైన అంశం.

హిందూత్వ ఉద్యమం అనుసరించే ఫాసిస్టు పద్ధతులను ఏకరువు పెట్టనవసరం లేదు. ప్రతీకలను ఉపయోగించడం, ఉద్రిక్త పరిస్థితిలో పుకార్లను వ్యాపింపచేయడం, మసీదు కూల్చివేతలో కల్యాణ్‌సింగ్ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదన్నమాదిరి అబద్ధాలను ప్రచారం చేయడం, అధికార యంత్రాంగంలోకి చొచ్చుకుపోవడం, అయోధ్యలో బలప్రయోగానికి పూనుకోకముందు వరకు ప్రచార సాధనాలను యుక్తిగా వినియోగించుకోవడం. సౌమ్యుడైన వాజ్‌పాయ్, తీవ్రవాది జోషి అని చెప్పడంలాంటి భిన్న ముఖాలతో ప్రత్యర్థులను గందరగోళపరచడం లాంటి ఖచ్చితమైన ఫాసిస్టు పద్ధతులను హిందూత్వ ఉద్యమం అనుసరించడం మనకు తెలుసు. దీనికి తోడు ప్రత్యర్థులపై దాడులు, దహనాలు, లూటీలు, మూకుమ్మడి హత్యలు, చొరబాటుదార్లనబడే వారిపై 'కార్యాచరణ పథకాలు' (మైనారిటీలు నివసించే ప్రాంతంలో), దౌర్జన్యకాండను బహిరంగంగా రెచ్చగొట్టడం లాంటి ఫాసిస్టు భీతావహ పరిస్థితులు ఉండనే ఉన్నాయి.

## ఫాసిస్టు కార్యక్రమం

చివరగా కార్యక్రమం గురించి చెప్పుకుందాం. ఆర్థిక, సామాజిక పునర్నిర్మాణం గురించి ఒక పటిష్టమైన కార్యక్రమం లేకపోవడం ఫాసిస్టు ఉద్యమం యొక్క ఒక

ప్రముఖ లక్షణం. 'కార్పొరేట్ పథకాన్ని' ప్రకటించిన ఇటలీ ఫాసిజం దీనికి ఒక మినహాయింపు. అంటోనియో గ్రామ్‌సి లాంటి మార్క్సిస్టులను సైతం ఇది తప్పు దోవ పట్టించింది ఇటలీ ఫాసిజం మాత్రమే. దాన్ని సైతం తొలిదశలోనే గ్రామ్‌సి చూశారు. పెట్టుబడిదారీ వ్యవస్థను సంక్షోభం నుండి కాపాడటానికి ఇటలీ ఫాసిజం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని ఆయన విశ్వసించారు. (ఆ తర్వాత టోగ్లియాట్టి ఫాసిజంపై ఉపన్యాసాలలో సైతం ఇటలీ అనుభవ ప్రభావం కనిపిస్తుంది. కొమింటెరన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో ఆయన ఈ ఉపన్యాసాలు చేశారు. అయితే ఆయన ఇటలీ కమ్యూనిస్టుల నుద్దేశించి ప్రసంగించారు).

జర్మనీలో నాజీలు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభించిన పునర్నిర్మాణం, ఆ దేశంలో కార్మిక వర్గ ఉద్యమాన్ని నిర్మూలించడం, యుద్ధానికి సన్నాహాలు చేయడం మాత్రమే. 1933-1939 మధ్యకాలంలో నాజీల అభివృద్ధి అంతా పునరాయుధీకరణపైనే ఆధారపడిందని మైకెల్ కాలెకి చెప్పారు. ట్రేడ్ యూనియన్లను నాశనం చేయడం వల్ల నిజవేతనాలు తగ్గించి, ద్రవ్యోల్బణ వత్తిడిని అదుపులో ఉంచడం సాధ్యమయిందని సి. డబ్ల్యు. గలివర్టీ 'జర్మనీ ఆర్థిక మెరుగుదల' అన్న గ్రంథంలో చెప్పారు. ఇది జరిగింది నాజీలు అధికారాన్ని సాధించిన తర్వాతనే. నాజీలు అధికారంలోకి రావడానికి పునాది అయిన నాజీ ఉద్యమానికి ఇటువంటి కార్యక్రమమనేది లేదు. ఈ కార్యక్రమాన్ని అమలు పరచడానికి ముందు హిట్లర్ నాజీ భావవాదానికి అంటిపెట్టుకొని ఉన్న తన మద్దతుదారులను మూకుమ్మడిగా చంపించాడు.

హిందూత్వ ఉద్యమానికి ముస్లిములపై దాడి అన్న ఏకైక సూత్రం ఉంది. దీనికిది మినహా ఇతర కార్యక్రమం ఏదీ లేదు. అందరికీ అన్ని ఇస్తానని చెబుతోంది. హిందూత్వ ఉద్యమానికి దౌర్జన్య పూరితమైన వర్గంగా పనిచేసే శివసేన ఊసరవెల్లి లాంటి సంస్థ. పరిస్థితులను బట్టి ఇది తన రంగును మార్చుకుంటుంది. మహారాష్ట్రేతరులకు వ్యతిరేకంగా మహారాష్ట్రలో పుట్టిన ఉద్యమానికి ఆ తర్వాత బొంబాయి ట్రేడ్‌యూనియన్ రంగంలో కమ్యూనిస్టు వ్యతిరేక, టెర్రరిస్ట్ సంస్థగా రూపుదాల్చింది. చివరికి ఇప్పుడు హిందూత్వానికి మొనగాడుగా ముందుకొచ్చింది. శివసేన సామాజిక, ఆర్థిక కార్యక్రమం గురించి మాట్లాడటం హాస్యాస్పదం. ఇటీవల కాలం వరకు ఫాసిస్టు ధోరణులను కనపడనీయని బి.జె.పి సైతం, ఒక సీరియస్ రాజకీయ పార్టీ అని

చాలామంది భావించే ఈ పార్టీ సైతం తన ఆశయాలను, కార్యక్రమాన్ని కాలి చెప్పులను మార్చినట్లు మార్చింది. ఒకప్పుడు 'సమగ్ర మానవతా వాదం' అని చెప్పింది. కొన్ని సార్లు 'గాంధీ వాద సోషలిజం' అని చెప్పింది. తర్వాత మళ్ళీ 'సమగ్ర మానవతావాదాన్ని' లంకించుకుంది. తన మౌలిక సైద్ధాంతిక అంశాలను చెప్పడంలోనే ఇన్ని పిల్లి గంతులు వేసిన ఆ పార్టీ తన కార్యక్రమాన్ని పదే పదే మార్చుకోవడంలో ఆశ్చర్యం లేదు.

కాంగ్రెస్ (ఐ) ప్రభుత్వం నూతన ఆర్థిక విధానంతో ముందుకు వచ్చినప్పుడు బి.జె.పి. దానికి మద్దతు ఇచ్చింది. ఐ.ఎం.ఎఫ్. ఆదేశిత వ్యవస్థాగత సర్దుబాటు చర్యలు తొలిదశలో పార్లమెంటులో బి.జె.పి. పరోక్ష మద్దతుతోనే అమలు పర్చ బడినాయని ప్రభుత్వ ఆర్థిక వేత్తలే చెప్పారు. అకస్మాత్తుగా బి.జె.పి. తన నినాదాన్ని 'స్వదేశీ'గా మార్చుకొంది. దీని అర్థం ఏమిటో స్పష్టంగా తెలియదు. నూతన ఆర్థిక విధానాలను, హిందూత్వాన్ని సమర్థించే ఎన్.ఆర్.ఐ.లు స్వదేశీ విధానం పట్ల ఆందోళన చెందుతున్నట్లు కనిపించారు. దీని వల్ల బి.జె.పి.లో ఎటువంటి మార్పు ఉండబోదని వారి దృఢ నమ్మకం కావచ్చు. 'స్వదేశీ'ని ప్రవచిస్తున్న బి.జె.పి. బహుళ సంస్థల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తుందని భావిస్తాము. కాని భారతదేశంలోకి బహుళజాతి సంస్థలను యథేచ్ఛగా ప్రవేశించనీయాలని కోరే అమెరికా ప్రభుత్వానికి బి.జె.పి. అడుగులకు మడుగులొత్తుతోంది. అయోధ్య ఘటనల తర్వాత తన వైఖరిని అమెరికా ప్రభుత్వానికి వివరించేందుకు బి.జె.పి. ఒక ప్రతినిధి బృందాన్ని సైతం పంపింది.

## పెరుగుదల కారణాలు

ఫాసిస్టు అభిప్రాయాలు, ఫాసిస్టు భావనలు పౌర సమాజంలో ఏ సమయంలోనైనా ఉంటాయి. ఈ భావనలు జనబాహుళ్యాన్ని కదిలించే సిద్ధాంతంగా మారినప్పుడు ఫాసిస్టు ఉద్యమాలు తలెత్తుతాయి. ఈ పరివర్తన ఎలా జరుగుతుందనేది ఒక మిస్టరీ. సంప్రదాయకంగాగాని, యూరోపా అనుభవాన్ని బట్టిగాని చూస్తే, ఈ పరి వర్తన వెనుక తక్షణ కారణంగా పెట్టుబడిదారీ సంక్షోభం ఫలితంగా పెద్ద ఎత్తున నిరుద్యోగం ప్రబలడం కనిపిస్తుంది. భారతదేశంలో హిందూత్వం ఆరంభమవడానికి ముందు ఈ విధమైన సంక్షోభ దశ ఉన్నట్లు కనిపించదు. స్వాతంత్ర్యానంతర భారత

దేశంలో పేదల పరిస్థితి మెరుగుపడలేదు. అధిక నిరుద్యోగం, ఆశలు అడుగంటడం గురించి మళ్ళీ చెప్పనక్కరలేదు. అయితే ఇది దీర్ఘకాలిక అంశం. ఆకస్మికంగా ఫాసిజం తలెత్తడానికి కారణం ఇదేనని చెప్పలేము. మండల్ నివేదిక అమలు హిందూత్వ శక్తులు పెచ్చరిల్లడానికి తక్షణ కారణమని భావించవచ్చు. అయితే హిందూత్వ శక్తుల విజయం గురించి వివరించవలసి ఉంది. అటువంటి వివరణ ఏదైనప్పటికీ ఊహాజనితమైనదే.

ఈ ఊహాగానంలో హిందూత్వానికి దోహదపడిన రెండు అంశాల గురించి చెప్పుకోవచ్చు. ఒక అంశం, సోవియట్ యూనియన్ కుప్పకూలడం. ఇది పరిస్థితిని మూడు విధాలుగా ప్రభావితం చేసింది. మొదటిది : మెరుగైన సోషలిస్టు సమాజాన్ని నిర్మించుకోవాలన్న స్వప్నాలకున్న ఊహాజనితశక్తిని ఇది నిర్మూలించింది. రెండవది: వైఫల్యాలు ఎన్ని ఉన్నప్పటికీ ఇటువంటి శక్తులకు వ్యతిరేకండా దృఢంగా నిల్చిన వామపక్ష ఉద్యమాన్ని ఈ పరిణామం కుదిపివేసింది. మూడవది : సోవియట్ యూనియన్ కుప్పకూలడంతో మధ్య ఆసియా రిపబ్లిక్కులలో ముస్లిం మతఛాందనశక్తులు విజృంభించాయి. ఇప్పటి రిపబ్లిక్కులలో మాజీ కమ్యూనిస్టులకు, ఈ మత ఛాందన శక్తులకు మధ్య పోరాటం సాగుతున్నది. ఒక రకమైన మత ఛాందనవాదం, దానికి విరుద్ధమైన మరొక ఛాందనవాదం ఆవిర్భవించడానికి కారణమవుతుంది. ఈ విధంగా హిందూ మత ఛాందన వాదానికి ఊపు లభించింది.

రెండవ అంశం, భారతదేశంలో 'జాతి నిర్మాణం' విఫలమవ్వడం. మతోన్మాదం జాతీయ వాదపు కుహనా చైతన్యమని కొందరు రచయితలు బావిస్తున్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ వాదం, మతోన్మాద జాతీయ వాదం రెండూ విరుద్ధమైనవి. సంపన్న పెట్టుబడిదారీ దేశాల ఆధిపత్యానికి అతీతంగా సంపద్వంతమైన, సజీవమైన, స్వతంత్ర భారతదేశ నిర్మాణం అన్న స్వప్నం భగ్నమయింది. ప్రత్యామ్నాయ ప్రతిపత్తి కోసం అన్వేషణ ప్రారంభమయింది. దీనితో జాతీయవాదం సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించడం నుండి ముస్లిములను వ్యతిరేకించడానికి మారింది. భారతదేశ విధానాలు, ఆర్థిక రంగంలోను, ఇతరత్రాను సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరి నుండి సార్వభౌమాధిపత్యాన్ని క్రమ క్రమంగా తాకట్టు పెట్టే విధంగా మారాయి. రుణాలు సంపాదించేందుకై బహుళజాతి సంస్థలను ఆహ్వానిస్తున్నది. ఈ పరిస్థితిలో ప్రత్యామ్నాయ

ప్రతిపత్తి మరింత ఆచరణాత్మకంగాను, ఆకర్షణీయంగాను కనిపిస్తున్నది. బి.జె.పి. తన స్వంత ముద్రకల్గిన 'జాతీయ వాదానికి', సామ్రాజ్య వాదానికి మధ్య వైరుధ్యం లేదని భావించడం ఆశ్చర్యం కల్గించదు. భారతదేశం నుండి బయటకు వెళ్ళి, విదేశాలలో స్థిరపడిన ఎన్.ఆర్.ఐ.,లు హిందూత్వ ఉద్యమానికి గట్టి మద్దతుదారులుగా ఉండటం కూడా ఏ మాత్రం ఆశ్చర్యం కల్గించదు.

## సామ్రాజ్యవాదానికి సలాముచేసే హిందూత్వ

ఈ అంశానికి గణనీయమైన ప్రాధాన్యత వుంది. హిందూత్వను హిందూ ఛాంసవాదమని చెప్పి ఖొమేని ఇస్లామిక్ ఛాందసవాదంతో పోల్చడం సరికాదు. ఇది రెండు విధాలుగా తప్పు. ఒకటి, ఖొమేని ఛాందసవాదానికి సామ్రాజ్యవాద వ్యతిరేక లక్షణమున్నది. అయితే ఛాందసవాదంతో కూడిన సామ్రాజ్యవాద వ్యతిరేకత ఎంతో కాలం కొనసాగదు. ఇదే విషయాన్ని ఇప్పుడు మనం చూస్తున్నాం. అయినప్పటికీ ఇదివేరే విషయం. ఆధునిక ప్రపంచంలో సామ్రాజ్యవాద వ్యతిరేకతకు మతఛాందసం పటిష్టమైన పునాదికాజాలదు. కాని హిందూత్వకు సామ్రాజ్యవాద వ్యతిరేకత ఏకోశానా లేదు. ప్రత్యామ్నాయ ముస్లిం వ్యతిరేక ఉనికిని ప్రతిబింబిస్తూ, సామ్రాజ్యవాదంతో రాజీపడతూ తనకు చట్టబద్ధతను కల్పించుకోవాలని హిందూత్వ ప్రయత్నిస్తోంది. రెండవది ఖొమేని ఛాంసవాదం వినియోగ సంస్కృతికి వ్యతిరేకమైంది కూడా. షా రాజు పాలనా కాలంలో సంపన్నులు గడిపిన విలాస జీవితాలను వ్యతిరేకించింది. నిరాడంబర జీవితాన్ని గడపాలని ప్రచారం చేసింది. ఈ నినాదంలో జనాకర్షణ కూడా ఉంది. కాని హిందూత్వలో ఇటువంటి లక్షణం లేదు. ఎ.సి. టయోటా కారును, హిందూమతాన్ని మిళితం చేస్తుంది. అయితే ఇది ఖొమేనీ పాలన క్రూరత్వం గురించి, నరహంతక స్వభావం గురించి తక్కువ చేసి చెప్పడం కాదు. ఈరెండు ఛాంస వాదాలకు మధ్య ఉన్న కొన్ని ప్రధాన తేడాలను చెప్పడానికి మాత్రమే.

బి.జె.పి. పూర్తిగా పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుకూలం. అనేక మంది పెట్టుబడిదారులు హిందూత్వ శక్తుల మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు. హిందూత్వ బలం పెరిగితే ఇటువంటి వారి సంఖ్య కూడా పెరగవచ్చు. పెటీ బూర్జువా వర్గం అంతగా బి.జె.పి.లో ఉన్నప్పటికీ ఆ పార్టీ పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఒక్క ముక్క కూడా చెప్పడం లేదు. హిందూత్వశక్తులు పెరగడం పెట్టుబడీదారీ అభివృద్ధికి అ మాటకొస్తే ఏ రకమైన ఆర్థికాభివృద్ధికీ వ్యతిరేకం.

పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడులు పెరగటానికి 'విశ్వసనీయ వాతావరణం' అవసరమైనంత కానప్పటికీ అసలంటూ ఉండాలి. మత కల్లోల్లా ఫలితంగా ఫ్యాక్టరీలు మూతబడినప్పుడు, ముస్లిం ఉద్యోగులను తొలగించమని యజమానులపై వత్తిడి పెరుగుతున్నప్పుడు, బడా పారిశ్రామికవేత్తలు సైతం మతోన్మాదానికి వ్యతిరేకంగా వీధుల్లో ప్రదర్శన చేయవలసివచ్చినప్పుడు హిందూత్వ శక్తుల పెరుగుదల పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధికి అనుకూలమైన విశ్వసనీయమైన వాతావరణాన్ని ఏర్పరుస్తుందని భావించగలమా? నాజీలలో మాదిరిగానే, హిందూత్వ శక్తులలో కూడా విభేదాలు పెరిగి, బడా బూర్జువాలతో కుమ్మక్కయి ఒక ముఠా మరొక ముఠాను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఈ 'విశ్వసనీయ వాతావరణం' ఎలా కల్పించబడుతుంది ? 1930వ దశకానికి ఇప్పటికి ప్రపంచ పరిస్థితికి ఎంతో తేడా వచ్చింది. పెట్టుబడులలో అంతర్జాతీయ చలనశీలత బాగా పెరిగింది. పెట్టుబడులు తృతీయ ప్రపంచ దేశాల నుండి సంపన్న దేశాలకు పయనిస్తున్నాయి. ఈ స్థితిలో హిందూత్వలాంటి ఫాసిస్టు ఉద్యమం, ఆ శక్తులు అధికారంలోకి ఎన్నడైనా రాగలిగితే ఆ ప్రభుత్వం పెట్టుబడిదారీ అభివృద్ధికి అవరోధమే అవుతాయి. హిందూత్వశక్తులు అధికారంలో ఉన్నప్పటికీ, అధికారాన్ని కోల్పోయి దాని కోసం ప్రయత్నిస్తున్నప్పటికి, ఈ శక్తులు బలంగానే ఉన్నాయి. కాబట్టి ఇవి ఏవిధమైన అభివృద్ధికీ ఆటంకంగానే ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన నూతన ఆర్థిక విధానానికి పునాది విదేశీ పెట్టుబడులు, ముఖ్యంగా బహుళజాతి కంపెనీలు భారతదేశంలో ప్రవేశించేందుకు అవసరమైన విశ్వాసాన్ని కలగచేయడం. కాని దీనికి అడ్డంకిగా వున్న హిందూత్వ శక్తులను అణచివేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కదలకపోవడం విచిత్రం. ఈ చిక్కుముడిని విప్పి అసలు విషయాన్ని గ్రహించాలంటే హిందూత్వలోని వైరుధ్యాలను తెలుసుకోవాలి. ఫాసిస్టు శక్తులు తలెత్తడానికి కారణమైన అంతర్జాతీయ, జాతీయ కారణాలను గ్రహించాలి. అదే క్రమంలో ప్రస్తుత హిందూత్వ గురించి తెలుసుకోవాలి.

## సంప్రదాయ నమూనాతో పోలిక

సంప్రదాయ ఫాసిజం తలెత్తిన పరిస్థితిలో మూడు ప్రత్యేకమైన ప్రస్ఫుటమైన లక్షణాలున్నాయి. మొదటిది : తీవ్రమైన పెట్టుబడిదారీ సంక్షోభం ఏర్పడి, అన్ని

సంపన్న దేశాలలోను నిరుద్యోగం విపరీతంగా పెరిగిన కాలమది. రెండవది, సంక్షోభానికి కారణమయి, అది మరింత అధ్వాన్నమవడానికి కారణమయిన సామ్రాజ్యవాదుల మధ్య అంతర్గత వైరుధ్యాలు తీవ్రమైన కాలమది. దీని ఫలితంగా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల్లో పడింది. 'బంగారం ప్రమాణం' కుప్పకూలింది. అంతర్జాతీయ పెట్టుబడుల చలనం పూర్తిగా అంతరించింది. క్రమబద్ధమైన అంతర్జాతీయ వాణిజ్యం అదృశ్యమయింది. ప్రతిదేశం తన పొరుగుదేశాన్ని ఎలా దివాళా తీయించాలన్న పద్ధతిని అనుసరించింది. అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థ ఖండఖండాలుగా చీలిపోయింది. మూడవది, సోషలిస్టు వ్యవస్థ సవాలు బలంగా వున్న కాలమది. ప్రథమ ప్రపంచ యుద్ధానంతర విప్లవోద్యమాల వెల్లువ త్రుంచి వేయబడింది. అయినప్పటికి ప్రపంచంలోని అది పెద్దదైనా, చిన్నదైనా ఏదేశంలోనూ బూర్జువావర్గం పదిలంగా అధికారంలో లేదు.

ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ముక్కలు, ముక్కలుగా ఉండటంతో పెద్ద దేశాలు సంక్షోభాల నుండి బయటపడటానికి 'జాతీయ' పరిష్కారాలను గురించి మాత్రమే ఆలోచించడం అవసరమూ, సాధ్యమూ అయింది. 'బూర్జువా' భాషలో చెప్పాలంటే కార్మికవర్గ ఉద్యమ బలాన్ని దెబ్బతీయకుండా ఇటువంటి పరిష్కారాలేమీ సాధ్యంకావు. ఫాసిజమనేది గుత్తపెట్టుబడిదారునకు కొంత స్థాయి వరకు ప్రతిచోట ఉపయోగంగానే ఉంటుంది. ఈ స్థాయి దాటి ఫాసిజం అధికారంలోకి వచ్చిన చోట సైతం ఫాసిస్టు నాయకులకు ఆధిపత్యధోరణులు కల్గిన బడాబూర్జువాలకు మధ్య లంకె ఉంటుంది. (గుత్త పెట్టుబడిదారీదారులలో పాత వినియోగ ఆధారిత పరిశ్రమలకు చెందిన వారి ప్రయోజనాలకు, క్రొత్తగా ఉత్పత్తి వస్తువులు, ఆయుధాల తయారీ పరిశ్రమలకు చెందినవారి ప్రయోజనాలకు మధ్య వైరుధ్యం ఉంటుంది. రెండవ తరహాకు చెందిన వారి నుండే ఫాసిస్టులకు మద్దతు లభిస్తుంది. మార్క్సిస్టు అధ్యయనంలో ఇది ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. డానియల్ గుయరిన్, కాలెకి మొదలైన వారు ఫాసిజంపై తమ గ్రంథాలలో ఈ విషయాన్ని చెప్పారు. భారతదేశానికి సంబంధించి దీనిపై ఇంకా మరింత పరిశోధన జరగవలసి వుంది). ఫాసిస్టు ఉద్యమంలో అంతర్గత ప్రక్షాళనల ద్వారా ఈ అనుబంధం మరింత బలపడింది. పూర్తి ఉద్యోగితను తెచ్చిపెట్టిన ఫలితంగా ఈ అనుబంధానికి కొంతకాలంపాటు చట్టభద్రత కోరుతుంది. ఫాసిజం ఎలా పూర్తి ఉద్యోగితను తీసుకువచ్చిందీ ఆలెకి వ్రాసిన "పూర్తి ఉద్యోగిత లక్షణాలు" అన్న గ్రంథంలో ఉంటుంది.)

అంతర్జాతీయ వాతావరణం నేడు దీనికి పూర్తి భిన్నంగా ఉంది. పెట్టుబడిదారీ ప్రపంచంలో సుదీర్ఘ ప్రతిష్టంభన, అధిక నిరుద్యోగం ఉన్నదనడంలో సందేహంలేదు. అయితే ఈ సంక్షోభం అనాడున్నంతటి తీవ్రమైంది కాదు. అంతకన్నా ముఖ్యంగా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ముక్కలు ముక్కలుగా లేదు. పెట్టుబడి అంతర్జాతీయ చలనం అడుగంటి పోవడానికి బదులు దేశాల మధ్య పెట్టుబడి చలన శీలత త్వరితమయింది. అందువల్ల బడా పెట్టుబడిదారులు తమ సమస్యలను దేశానికి లోపలే పరిష్కరించుకోవలసిన అవసరం లేదు. ఆదేశాలలో సైతం కార్మిక వర్గ ఉద్యమం తీవ్రమైన సవాలుగా లేదు. ఈ విషయం సంపన్న దేశాలతోపాటు భారతదేశంలో కూడా ఒక వాస్తవం. అందువల్ల ఫాసిజం బడాబూర్జువాలకు ఉపయోగమే అయినప్పటికీ గతంలో మాదిరిగా సంపన్న దేశాలలోగాని, భారత దేశంలోగాని, అంత అవసరం లేదు.

## అంతర్గత వైరుధ్యాలు

భారతదేశంలో ఫాసిస్టు ఉద్యమం ఎదుర్కొంటున్న వైరుధ్యాల గురించి చెప్పాలి. ఫాసిజాన్ని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు హిందూత్వ వేదిక ఒక్క దానికే వర్గరీత్యా తగినంత బలం లేదు. ఈ శక్తులతో హిందూత్వ అధికారంలోకి రావాలంటూ మరికొంత అదనంగా బలాన్ని కూడగట్టుకోవాలి. జనాకర్షక వేదికతో కూడిన హిందూత్వ గ్రామసీమలలో సమాజిక పునాదిని విస్తరించుకోవచ్చు. కాని సామ్రాజ్యవాదులు, బూర్జువా వర్గాలు దానిపట్ల అనుమానంగానే చూస్తాయి. స్వదేశీ వేదికతో కూడిన హిందూత్వ విస్తృతమైన సెక్షన్లను ఆకర్షిస్తుంది. సామ్రాజ్యవాద ప్రవేశాన్ని దేశీయ బూర్జువా వర్గం, రాజ్యాంగ యంత్రం సన్నిహితంగా కలిసి వ్యతిరేకించే ఈ నయా వ్యాపార దృక్పథం తూర్పు ఆసియా దేశాల స్ఫూర్తితో చేపట్టబడేది. అయితే ఇది సామ్రాజ్యవాదులతో నేరుగా ఘర్షణపడేందుకు దారి తీస్తుంది. ఈ ఘర్షణకు హిందూత్వ శక్తులు సిద్ధంగాలేవు. బహుళజాతి సంస్థలతో కూడిన హిందూత్వ వేదిక ఈ శక్తులు దేశీయ సామాజిక పునాదిని కోల్పోయేలా చేస్తుంది. అదే సమయంలో దేశంలో కార్మిక వర్గ ఉద్యమం పెద్ద సవాలుగా లేని స్థితిలో హిందూత్వ శక్తులతో మైత్రి అవసరమని కూడా బహుళజాతి సంస్థలు భావిస్తున్నాయి. ఆ విధంగా ఈ పునాది ఆధారంగా అధికారానికి ఎగబ్రాకాలన్న వ్యూహం కూడా నిలబడేది కాదు.

ఇది మన సమాజానికి, రాజకీయ వ్యవస్థకు ఈ శక్తుల నుండి వచ్చే ప్రమాదాన్ని తక్కువచేసి చెప్పడం కాదు. ఈ ప్రమాదం ఎంత సంక్లిష్టమైన రూపం

తీసుకుంటుందో తెలపడానికి ఇది చెబుతున్నాను. ఫాసిజం అధికారం కోసం ప్రయత్నించడం, ఆ ప్రయత్నాలు విఫలమయితే ప్రజాతంత్ర శక్తులు విజయం సాధించాయని భావించడానికే మనం అలవాటు పడ్డాం. దానినే తక్షణ, ప్రధాన అంశంగా తీసుకుంటున్నాం, కాని ఈ కూటమి పరిధిని మించి మన ఆందోళన ఉండాలని నేను భావిస్తున్నాను. ప్రస్తుత పరిస్థితిలో అధికారంలోకి రావడానికి నిరోధించే వైరుధ్యాలు ఫాసిజం ఎదుర్కొంటున్నదన్నదాన్ని నా వాదన స్ఫురింపచేస్తున్నది. ఇది అధికారానికి వచ్చే తన ప్రయత్నంలో అనివార్యంగా విఫలమవుతుంది. అని చెప్పడం కాదు. (ఇది అర్ధరహితమైన ఆర్థిక నిర్ణయవాదం అవుతుంది.) బూర్జువా పార్టీల ప్రతిఘటన, చైతన్యం మొదలైన నిర్దుష్ట పరిణామాలపై ఇది ఆధారపడుతుంది. అయితే ఫాసిజం అధికారం కోసం జరిపే ప్రయత్నాలలో అంతర్గతంగానే వైరుధ్యం ఉన్నదని గ్రహించాలి.

## క్యాన్సర్ లాంటి పెరుగుదల

మరింత ముఖ్యమైన విషమేమంటే ఆప్రయత్నంలో విఫలమయినప్పటికీ క్రింది కారణం రీత్యా ఫాసిజం అనేది రాజకీయ వ్యవస్థపై క్యాన్సర్‌లా పెరుగుతోంది. ఫాసిజం అనేది అధికారంలోకి రావడం, లేదా దానికి సన్నిహితంగా ఉండటం అన్నది సామ్రాజ్యవాదానికి, బడా పెట్టుబడిదారులకు ఇప్పటికిప్పుడు అవసరం కానప్పటికి దానిని వారు భవిష్యత్తులోనయినా ఉపయోగించుకోవడానికి కాపలా కుక్కలా అట్టిపెట్టుకుంటారు. ఫాసిజాన్ని సామ్రాజ్యవాదం గొలుసుతో బంధించిన కుక్క అన్న మాటను పైన పేర్కొన్న 'వర్తమాన ఫాసిజం' అన్న తన గ్రంథంలో కాలెకి ఉపయోగించారు. నూతన ఆర్థిక విధానాలు కష్టజీవులపై అంతకంతకు అధికభారాలు మోపడంతో వీటికి ప్రతిఘటన కూడా తీవ్రమవుతోంది. దేవ సార్వభౌమాధిపత్యం తాకట్టు పెట్టబడుతున్నది. ఈ ప్రతిఘటన కార్మిక వర్గ ఉద్యమం చుట్టూ సమీకృతమవుతోంది. ఈ ప్రతిఘటనను దెబ్బతీయడానికి సామ్రాజ్యవాదులు, బడా పెట్టుబడుదారుల్లోని కొన్ని సెక్షన్లు అవసరమైనప్పుడు వదిలిపెట్టడానికి అనువుగావున్న ఈ అదుపు చేయబడిన ఫాసిజంను అంగీకరిస్తాయి. గొలుసు విప్పితే ఈ ఫాసిజంప్రళయాన్ని సృష్టిస్తుంది. ఇది అదుపులో

ఉన్న సమయంలో పాలక బూర్జువా పార్టీయే దీనికి సంబంధించిన కొన్ని నినాదాలను లంకించుకుంటుంది. (ఉదాహరణ ఉదార కాషాయ వైఖరి). ఫాసిజం విజృంభణ పాలక పార్టీకి చట్టబద్ధత కల్పిస్తుంది. పాలక పార్టీ ఆర్థిక విధానాల నుండి కేంద్రీకరణను ప్రక్కకు మళ్ళిస్తుంది. పాలక పార్టీ హిందూత్వ శక్తుల పట్ల ఊగిసలాట వైఖరి అనుసరించడానికి ఇదొకకారణం. అయా అంచనాలు కొన్ని సరియైనవి కావని నిరూపించబడవచ్చు. అయా వ్యూహాలు సంపూర్ణంగా ఖచ్చితమైనవికావని తేలవచ్చు. ఇది ఏదైనా ఒక బూర్జువా రాజకీయ పార్టీ భవిష్యత్‌పై ప్రభావం చూపవచ్చు. అందువల్లప్రస్తుతం ఉనికిలో ఉన్నలేదా ముందు ముందు ఉనికిలోకి రానున్నపార్టీ (ఉదాహరణకు కొన్ని కాంగ్రెస్ శక్తులు బి.జె.పి.తో చేతులు కలపడం వల్ల) 'అదుపులో ఉండేఫాసిజం' వైఖరిని గైకొనడం నేడు ప్రధాన అజెండాగా కన్పిస్తున్నది. ఫాసిజం అధికారం కోసం జరిపేప్రయత్నంలో ఇప్పుడు విజయం సాధించలేకపోయినప్పటికీ ఫాసిజం అనేది సమాజంలో ప్రమాదకరమైన అంశంగా మిగిలే ఉంటుంది. మనం కేవలం ఫాసిజం బలన్నేకాకుండా, అదుపులో ఉంచబడటం వల్ల నిస్పృహకులోనైన ఫాసిజం బలాన్ని కూడ గమనంలో ఉంచుకోవాలి.

పైన పేర్కొన్నదాని అర్థం స్పష్టమే. ఫాసిజంపై పోరాడటమంటే కేవలం ఆ శక్తుల తక్షణ వ్యూహాన్ని ఓడించడం మాత్రమే కాదు. స్వల్ప కాలిక దృష్టితో చూసినప్పుడు అదీ ప్రధానమైనదే. కాని మధ్యకలిక, దీర్ఘకాలిక దృష్టితో చూసినప్పుడు అదుపులో ఉంచబడిన ఫాసిజంను గమనంలో ఉంచుకోవాలి. ఈ ఫాసిస్టు వ్యతిరేక పోరాటం ప్రత్యామ్నాయ సామాజిక అర్థిక విధానాల కోసం జరిపే పోరాటంతో ముడిపడి ఉంటుంది. ప్రజాతంత్ర వ్యవస్థలను బలోపేతం చేయడం ఈ పోరాటంలో బాగంగా ఉంటుంది. నూతన అర్థిక విధానాలకు శక్తివంతంగా అమలు జరపడం, తద్వారా మార్కెట్ శక్తులను అభివృద్ధి పరచడం, అర్థిక వ్యవస్త 'ఆధునీకరించడం' ఫాసిజం పునాదిని బలహీనపరుస్తుందని కొందరు వాదిస్తున్నారు. పైన పేర్కొన్న కారణాల రీత్యా ఈ వాదన శుద్ధ తప్పు అని తేల్తుంది.

✡

# ఫాసిజం నాడు - నేడు

## నేటి పరిస్థితుల్లో గ్రామ్‌సీ రచనల ప్రాధాన్యత

ఐజాజ్ అహ్మద్

డానియల్ గెరిన్ అనే ఫ్రెంచి సోషలిస్టు చరిత్రకారుడు ఇలా వ్రాశారు. "సోషలిజాన్ని సాధించుకోలేకపోతే, ఫాసిజమనే శిక్ష మనకు పడుతుంది." దీనిలో ఇమిడి ఉన్న అర్థం స్పష్టమే. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఫాసిజం ప్రమాదం ఎల్లప్పుడు పొంచి ఉంటుంది. సోషలిస్టు ప్రజాస్వామ్య శక్తులు బలహీన పడినప్పుడు, ఎదురు దెబ్బలు తిన్నప్పుడు ఈ ప్రమాదకర ధోరణి మరింత శక్తివంతమవుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ సోషలిజానికే పరివర్తన చెందవలసిన అవసరం లేదు. ఆటవిక వ్యవస్థకైనా మారవచ్చు' అని ప్రశస్తి గాంచిన మార్క్స్ ఉటంకింపుకు పునరుద్ఘాటనే ఇది. రెండు ప్రపంచ సంగ్రామాల మధ్యకాలంలో ఐరోపాలో ఫాసిజం ఎలా ఆవిర్భవించింది, ఇప్పుడు ఐరోపాలోనూ ఇతర చోట్ల ఎలా పునరావిర్భవించిందీ గెరిన్ మనకు గుర్తు చేస్తున్నారు.

1920, 30 దశకాల్లో ఐరోపాలో కార్మిక వర్గ ఉద్యమం అత్యంత బలోపేతంగా ఉన్నచోట, అతి క్రూరంగా అణచివేయబడిన చోట అంటే జర్మనీ, ఇటలీ, స్పెయిన్‌లలో ఫాసిజం పెద్ద విజయాన్ని సాధించింది. ఇతర విషయాల్లో ఈ దేశాలు పరస్పరం ఎంతో తేడాలు కల్గిఉన్నాయి. జర్మనీ బాగా పారిశ్రామికవంతమైంది. ఇటలీ ఉత్తరప్రాంతంబాగా పారిశ్రామిక వంతమైంది. 40 శాతం ప్రజలు నివసించే దక్షిణ ప్రాంతంలో పరిశ్రమలు నామమాత్రమే. స్పెయిన్ ఒకప్పుడు పెద్ద వలస సామ్రాజ్యాన్ని కల్గి ఉన్నప్పటికీ పారిశ్రామికంగా అభివృద్ధి చెందలేదు. ఇటలీ, స్పెయిన్‌లలో కాథలిక్ మతం ఉంది. ఫాసిస్టులు, మితవాదులు అధికారంలోకి రావడంలో మతపరమైన ఉద్యమాలు కూడా చెప్పుకోదగిన

అంశాలే. జర్మనీలో ప్రొటెస్టెంట్ మతం ఉంది. మిగిలిన రెండు దేశాల కన్నా అధునాతనమైంది. చర్చి నాజీల చర్యల పట్ల ఉదాసీనం వహించడం మినహా ఏమీ చేయలేదు. యూదులను, పోలిష్ ప్రజలను, జిప్సీలను, రష్యన్లను నాజీలు ఊచకోతకోశారు. ఇటలీలో కూడా మైనారిటీలపై అణచివేత అమలు జరిగినప్పటికీ జర్మనీలో జరిగినంత స్థాయిలో జరగలేదు.

అందువల్ల ఫాసిజం అనేది కేవలం అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో మాత్రమే ఉద్భవించే పరిణామం కాదు. ముస్సోలినీకాలంలో ఇటలీలో పారిశ్రామికీకరణ నేటి ఇండియాలో పారిశ్రామికీకరణ కంటే తక్కువగానే ఉంది. అయితే ఆయా దేశాల్లో తలెత్తే ఫాసిజంతరహా, అది పాలించే తీరు ఒక్కొక్క దేశపు అంతర్గత స్వరూపంపై ఆధారపడిఉంటుందని కూడా గత అనుభవం తెలియచేస్తున్నది. జర్మనీ బాగా పారిశ్రామిక వంతమైన దేశం. నాజీల పెరుగుదలలో ఫైనాన్స్, పెట్టుబడిప్రధాన పాత్ర వహించింది. వ్యవసాయ వర్గాలు అంతగా ప్రాధాన్యత వహించలేదు. జర్మనీతో పోల్చుకొన్నపుడు ఇటలీ అధికంగా వ్యవసాయక దేశం. రాష్ట్ర రాజధానులు పట్టణాభివృద్ధిలో అధిక ప్రాధాన్యత వహించాయి. తరువాత కాలంలో ముస్సోలినీకి మద్దతు పట్టణ పెటీబూర్జువా వర్గం నుండి, బడా పెట్టుబడిదార్లనుండి లభించినప్పటికీ తొలుత ప్రధానంగా మద్దతు ఇచ్చింది పైన పేర్కొన్న రంగాలు మత్రమే. స్పెయిన్‌లో పచ్చిమితవాద శక్తులు రిపబ్లిక్‌కు వ్యతిరేకంగా జరిగిన సుదీర్ఘ యుద్ధంలో ఒక్కటయ్యాయి. అందువల్ల అధికారం ఒక ఫాసిస్టు పార్టీలో కేంద్రీకరించబడకుండా, ఒక సైనిక నియంతృత్వంలో కేంద్రీకరించబడింది.

ఒక్క ముక్కలో చెప్పాలంటే ప్రతిచోట ఫాసిజం ఒకే రూపంలో ఉండదు. ఇటలీ కమ్యూనిస్టు పార్టీ స్థాపకులలో ఒకరు, గ్రామ్‌సీ ఒకప్పటి సహచరుడు ఆంజిలో టాస్కా తన 'ఇటలీ ఫాసిజం చరిత్ర' అనే గ్రంధంలో ఇలా వ్రాశారు. "ఫాసిజం గురించి సిద్ధాంతీకరించడానికి అత్యుత్తమ మార్గం, దాని చరిత్రను చెప్పటమే" ఫాసిజం గురించిన ఏ సిద్ధాంతమయినా మూడు విభిన్నమయిన, అంతర్గతంగా పెనవేసుకున్న వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన అభిప్రాయం. 1. ఫాసిజం అనేది ఒక ప్రత్యేకమైన ప్రపంచ చారిత్రక పరిస్థితుల్లో ఉద్భవిస్తుంది. 2. ఈ పరిస్థితులు వివిధ దేశాలలో ఫాసిస్టు వుద్యమాలను రేకెత్తిస్తాయి. 3. ఈ ప్రపంచ ధోరణి ఆయా 'దేశాల పరిస్థితుల్లో ప్రత్యేక జాతీయతా రూపాన్ని సంతరించుకుంటుంది. తొలుత ఫాసిజం అనే దాన్ని ఏ విధంగా పిలిచామో, దానికి సంబంధించిన కొన్ని మౌలిక అంశాలు కల్గిఉన్న ఉద్యమాన్ని నేడు కూడా ఫాసిజం అని పిలవవచ్చు. కాని నేటి ఉద్యమాలు జాతీయంగానూ, అంతర్జాతీయంగాను నేటి పరిస్థితులనే

ప్రతిబింబిస్తాయి. అందువల్ల ప్రత్యేకమైన నూతన రూపాలను కలిగి వుంటాయి. ఉదాహరణకి సంఘ పరివార్ రాజకీయాలను ఫాసిస్టు రాజకీయలంటున్నామంటే (సంఘ పరివార్ అంటే కేవలం దాని పార్లమెంటరీ విభాగమైన బి.జె.పి. ఒకటే కాదు. ఆర్.ఎస్.ఎస్., వి.హెచ్.పి., భజరంగ్‌దళ్, మొదలయినవి కూడా) అది హిట్లర్ నాజీ పార్టీకి నకలు అని చెప్పడంలేదు. ఈ సందర్భంలో ఫాసిజం అనేది మౌలికమైన సైద్ధాంతిక, వర్గపునాది, సమీకరించే పద్ధతులు, మితవాద శక్తుల జాతీయ కూటమి ఏర్పాటులో కేంద్ర పాత్ర వహించడంలాంటి అంశాలకు మాత్రమే ఇదివర్తిస్తుంది. (ఏ ఫాసిస్టు పార్టీ ఎన్నికలలో మెజార్టీ పార్టీగా రాలేదు. మొత్తం మితవాద శక్తులు దాని నాయకత్వ పాత్రను అంగీకరించినపుడు, అత్యధిక ఆస్తిపరవర్గాలు, వృత్తివర్గాలు దాని ఆధిక్యతను అంగీకరించినపుడు ఫాసిజం ప్రాబల్యం సంపాదించుకుంటుంది) అందువల్ల భారతదేశంలోని ప్రత్యేక చారిత్రిక, సామాజిక సరిస్థితుల్లో వుద్భవించిన ఫాసిజం ప్రత్యేకమైన భారతీయ రూపంలో కూడి వుంటుందని వేరుగా చెప్పనక్కరలేదు. ఈ ప్రత్యేకతను కూడా గతితార్కికంగానే మనం గుర్తించాలి. గత, ప్రస్తుత ప్రపంచ చారిత్రక శక్తుల ఉద్యమాలతో సంబంధం కల్గిన ప్రత్యేకమైన జాతీయ అనుభవం ఇది.

## నేటి ఫాసిజం ఆవిర్భావం

ప్రస్తుతం భారతదేశంలో ఫాసిస్టు ధోరణుల పెరుగుదలకు ప్రధానంగా అంతర్గత సమస్యలే కారణం అయినప్పటికీ, ప్రపంచ వ్యాపితంగానూ ముఖ్యంగా యిరోపాలోని ధోరణిలో భాగమే ఇది. అనేక అంశాల కారణంగా 1970వ దశకంలో ప్రస్తుత ఫాసిస్టు ఉద్యమం మొదలయింది. ఇండో చైనా, ఆఫ్రికా దక్షిణప్రాంతంలో విమోచన విప్లవ యుద్ధాలు ప్రపంచ వ్యాపితంగా పెట్టుబడిదారీ వ్యతిరేక బావనలను పెంపొందించాయి. ఈ ప్రభావం యిరోపా మీద కూడా పడింది. ఫ్రాన్స్‌లో 1968లో ప్రపంచంలోనే చారిత్రాత్మక మైన అతి పెద్ద కార్మిక పోరాటం జరిగింది. రెండు కోట్ల మంది కార్మికులు సమ్మె చేశారు. వలస యుద్ధాలు పోర్చుగల్‌లో పూర్తి స్థాయి విప్లవంగా పరాకాష్టకు చేరాయి. దీనిలో కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం కీలకమైన పాత్ర వహించింది. ఇటలీ కమ్యూనిస్టుపార్టీ యిరోపాలో ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగిన తొలిపార్టీ స్థాయికి దాదాపు చేరుకుంది.1976 ఎన్నికల్లో కేవలం 4 శాతం ఓట్ల తేడాతోనే ఆ పార్టీ ఓడిపోయింది. పార్లమెంటరీ ఏతర వామపక్ష గ్రూపులు కూడా అనేక యిరోపా దేశాలలో ఏర్పాడ్డాయి. ఈ శక్తులనన్నింటినీ సామ్రాజ్యవాదం త్రిప్పికొట్ట గలిగింది.. అయితే ఆ రోజుల్లో పాలకవర్గాలలో ఏర్పడిన భీతావహ పరిస్థితిలో ప్రపంచ యుద్ధానంతర యిరోపాలో తొలిసారిగా ఫాసిజం తిరిగి

తలెత్తింది. పెటీ బూర్జువా వర్గాలలో ఈ భీతావహం రెండు అంశాల ఫలితంగా అధికమయింది. 1970వ దశకం ఆరంభంలో దీర్ఘకాలం పాటు ఆర్థిక మాంద్యం కొనసాగటం, ప్రతి ప్రధాన ఐరోపా దేశంలోను, ఐరోపాయేతరులు ముఖ్యంగా కార్మికులు పెద్ద మైనారిటీలుగా వుండటం ఈ రెండు అంశాలు. ఈ మైనారిటీలపై ఐరోపా మితవాదులు ముఖ్యంగా ఫాసిస్టులు దాడులు చేయడం నిత్యకృత్యమైపోయింది. 1980వ దశకం మధ్యనాటికి ఈ ప్రమాదం తీవ్ర రూపం దాల్చింది. సోషల్ డెమోక్రట్లు ఆధిక్యతలో ఉన్న ఐరోపా పార్లమెంటు, ఐరోపా వ్యాపితంగా జాతి వివక్షతాపూరిత, ఫాసిస్టు చర్యలపై దర్యాప్తు జరపటానికి, ప్రతిఘటించడానికి ఒక న్యాయ కమిటీని ఏర్పాటు చేయాలని ఒక సంయుక్త ప్రకటన విడుదల చేసింది.

ఈ ఫాసిస్టు గ్రూపుల అభివృద్ధి 1988 నాటికి ప్రమాదకరమైన రూపు దాల్చింది. తూర్పు ఐరోపా, సోవియట్ యూనియన్లలో కమ్యూనిస్టు ప్రభుత్వాలు రద్దవడం, సోవియట్ యూనియన్, యుగొస్లోవియాల విచ్ఛిన్నం, పశ్చిమ ఐరోపాలో కార్మిక వర్గానికి సోషల్ డెమొక్రటిక్ రక్షణ తొలగటం, దీర్ఘకాలిక మాంద్యం ఫలితంగా ఏర్పడిన సాంఘిక దుష్ఫలితాలు ఇవన్నీ కలిసి పచ్చిమితవాద, ముఖ్యంగా ఫాసిస్టు ధోరణుల పెరుగుదలకు అనుకూల పరిస్థితిని ఏర్పరిచాయి.

యుగోస్లావియా ఐరోపాలో అత్యంత ప్రశాంతమైన బహుళ మత, బహుళ జాతి దేశం. కాని నేడు అక్కడ ఫాసిస్టులుగా చెప్పుకుంటున్నవారు సెర్బియా, క్రోషియాలలో ఇతర జాతుల వారిని నిర్మూలించే నాయకులలో ఉన్నారు. దీనినేవారు 'జాతి ప్రక్షాళన' అని అంటున్నారు. ఐరోపావాసులు, ఆసియావాసులు చెరిసమానంగా వున్న బహుళ జాతుల సమైక్య దేశాన్ని నిర్మించే ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించిన సోవియట్ యూనియన్ ఇప్పుడులేదు. రష్యాలో ద్రవ్యోల్బణం, స్వేచ్ఛా మార్కెట్ ఫలితంగా ప్రజలు రెండు తరాలుగా కూడ బెట్టుకున్న మొత్తాలుహరించి పోయాయి. మూడింట రెండు వంతుల ప్రజలు నిష్ఠదారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. వ్యవసాయ రంగంలోనివారు పెన్షన్లు, పొదుపుపై ఆధారపడుతున్న వృద్ధులు, స్థిర ఆదాయం కల్గిన సైనికుల వంటి వారు, ఒంటరిగా వుంటున్న మహిళలు, నైపుణ్యతలేని కార్మికులు ముఖ్యంగా ఇటువంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీనివల్ల ఎల్సిన్ పట్ల విస్తృతమైన ప్రజా వ్యతిరేకత ఏర్పడింది. వామపక్షాలు మళ్ళీ బలం పుంజుకునే సూచనలు కనిపించాయి. కాని మితవాద ఫాసిస్టు శక్తులు మరింత సంఘటితంగా ఉన్నాయి. ఈ ఫాసిస్టులు జాతి దురహంకార రష్యన్ సామ్రాజ్య పునరుద్ధరణ నినాదాలు, సోవియట్ యూనియన్ ప్రాదేశిక విచ్ఛిన్నం, తమ

జీవనాలు దుర్భర స్థితిలోకినెట్ట బడటాన్ని అనుభవిస్తున్నప్రజానీకాన్ని తేలిగ్గా ఆకర్షిస్తున్నాయి.

ప్రజల నిజమైన కష్టాలను, ఆందోళనలను వాగాడంబరంతో తమకు అనుకూలంగా మలుచుకోవడంఫాసిజం యొక్క ఒక ప్రధాన లక్షణం. రష్యన్ పార్లమెంటులో అత్యధిక స్థానాలను అత్యధిక ఓట్లను సంపాదించిన ఏకైక పార్టీ నాయకుడు జిరొనోవ్స్కీ మార్క్సిటైజేషన్, అమెరికనైజేషన్‌ల ఉత్పత్తే. అయినప్పటికీ ఆయన ఈ క్రమం వేగాన్ని తగ్గిస్తానని వాగ్దానం చేస్తున్నాడు. ఇటువంటి వాగ్దానాలు ఓట్లు సంపాదించి పెడతాయని ఆయనకుబాగా తెలుసు. రష్యనేతర మైనారిటీలను దేశం నుండి బహిష్కరించాలని, "ఒకే రక్తం, ఒకే గడ్డ" సిద్ధాంతం ఆధారంగా పరిశుద్ధమైన సాంప్రదాయబద్ధమైన రష్యాను నిర్మించాలన్నది ఆయన నినాదం. నాజీ నినాదాల్ని, భారతదేశంలో హిందూత్వవాదుల నినాదాల్ని ఇది తలపిస్తున్నది. ఎన్నికలయిన వెనువెంటనే జిరొనోవ్స్కీ ఆస్ట్రియాలోని ఒక పర్యాటక కేంద్రానికి వెళ్ళి అక్కడ ఐరోపాలోని ఇతర ఫాసిస్టు సహచరులను కలుసుకున్నాడు. ఫాసిజం అనేది నేడు ఒక దేశానికే పరిమితమైన పరిణామంకాదని, పరస్పరం సంబంధం కలిగిన ఐరోపా ఖండదేశాలన్నింటికీ చెందిన అంశమని ఈ విషయం విదితం చేస్తున్నది. దీనిని 'యూరో ఫాసిజం'అని చెప్పవచ్చు.

తాను ఫాసిస్టునని బహిరంగంగా ప్రకటించుకున్న ఒక వ్యక్తి ఇటీవల బ్రిటిష్‌పార్లమెంటుకు ఎన్నికయ్యాడు. అదే విధంగా ఫాసిస్టు కార్యక్రమంతో ముస్సోలిని మనుమరాలు ఇటలీ పార్లమెంట్‌కు ఎన్నికయింది. తాము ఫాసిస్టులమని ఇంతగా బరితెగించి చెప్పుకోవడం అరుదు. హిట్లరు, ముస్సోలినీలకు వారసులమని చెప్పుకునే వారిని నాయకులుగా అంగీకరించేందుకు ప్రజలు సిద్ధంగా లేరు. ఆనాటి ఫాసిస్టు భీతావహం ప్రజలస్మృతి పథంలో ఇంకా నిలిచిఉండటమే దీనికి కారణం. అందువల్ల ఐరోపాలోగాని, భారతదేశంలోగాని ఫాసిజం పచ్చి జాతీయవాద నినాదం మాటున ముందుకొస్తున్నది. జాతీయవాదంలో ఫాసిస్టు నిర్వచనాన్ని ఇమిడ్చే ప్రయత్నం ఇది. సంప్రదాయ స్వచ్ఛత, సాంస్కృతిక పునర్వికాసం గురించి నొక్కి చెప్పే ఈ ఫాసిస్టు తరహా జాతీయవాదం నిరంకుశ రాజకీయపార్టీ అధికారంలోకి రావడానికి మార్గాన్ని సుగమం చేస్తుంది.

రెండవది, అంతర్గత మైనారిటీని జాతికి నిజమైన శత్రువుగా చిత్రిస్తారు. ఆ మైనారిటీ పై దాడి చేయడం, అణిచివేయడం, నిర్మూలించడం, వెళ్ళగొట్టడం, జాతి స్వచ్ఛతను కాపాడటానికి మార్గమని ప్రచారం చేస్తాయి. నిరంకుశ ప్రభుత్వం వస్తే తప్ప పరిస్థితి చక్కబడదని ప్రజలు భావించేలా చేసేందుకు తరచు శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తాయి. ఆ పార్టీ తగినంత అధికారాన్ని సమకూర్చుకున్న తర్వాత, ప్రజాతంత్ర ప్రభుత్వ స్థానంలో

'జాతీయ భద్రతా ప్రభుత్వం' ఏర్పాటు చేయాలని చెప్పడానికి 'శాంతిభద్రతల' పరిస్థితిని ఉపయోగించుకుంటుంది. ఇది ఏక పార్టీ పాలనకు దారితీస్తుంది. ఈ స్థితిలో ఫాసిస్టు జాతీయవాదిగాను, ప్రజాతంత్రవాదిగాను చెప్పకుంటూనే ఉంటాడు. ఎందువల్లనంటే మెజారిటీ ప్రజలే నిజమైన జాతి అంటూ, ఆ మెజారిటీకి తానే ప్రతినిధినని చెబుతాడు కాబట్టి. 'మైనారిటీ'పరాయి జాతి అని పంచమాంగదళంగా వ్యవహరిస్తున్నదని, సంస్కృతిని కలుషితం చేస్తున్నదని ప్రచారం చేస్తారు. మొత్తం మెజారిటీని తన ఫాసిస్టు గొడుగు క్రిందకు తీసుకురావాలన్న ప్రయత్నంలో 'మైనారిటీ'ని ఈ పార్టీలు ఉపయోగించుకుంటాయి. ఆదే సమయంలో అన్ని రకాల పునరుద్ధరణవాద, జాతిదురభిమాన సిద్ధాంతాలను ప్రచారం చేస్తాయి. మహిళలను 'సంప్రదాయ'బద్ధమైన స్థానంలో ఉంచాలని, 'విదేశీ సిద్ధాంతం' ప్రభావంతో కమ్యూనిస్టులు దేశాన్ని వర్గాలుగా చీలుస్తున్నారని - ఇలా పలు రకాలుగా ప్రచారం చేస్తాయి.

## జాతిదురభిమానం

ఐరోపా అంతటా, తూర్పు, పశ్చిమప్రాంతాలలో అలాగే భారతదేశంలో ఫాసిస్టులు ప్రధానంగా జాతి దురభిమానులుగా కనిపిస్తారు. పాలకవర్గానికి చెందిన ప్రధాన ప్రతినిధులు కూడా కొంత సౌమ్యంగానే అయినప్పటికీ, ఇదేవిధమైన మాటలను చెప్పడం వల్ల ఫాసిస్టులు సమాజంలో గౌరవనీయమైన స్థానాన్ని సంపాదించుకోగలుగుతారు. కన్సర్వేటివ్ పార్టీకి చెందిన బ్రిటిష్ ప్రధాని మార్గరెట్ థాచర్ " బ్రిటిష్ సంస్కృతిని ఆసియా మైనారిటీలు దురాక్రమణ చేస్తున్నారు" అని విమర్శించేవారు. అదే విధంగా సోషలిస్టు పార్టీకి చెందిన ఫ్రెంచ్ అధ్యక్షుడు మిట్టరాండ్ ఫ్రాన్స్‌లో మైనారిటీల పట్ల సహనం వహించే 'పరిమితి' 1970వ దశకంతోనే ముగిసిందని చెప్పారు. 'మైనారిటీల బుజ్జగింపు' అని ఆర్.ఎస్.ఎస్. చెప్పేమాటలు వీటికి భిన్నమైనవి కావు. ఇదేదో నిజమైన సమస్య అన్న రీతిలో పత్రికలు దీని గురించి విపరీతంగా చర్చించేవి.

ఉదాహరణకు ఫ్రాన్స్‌నే తీసుకుందాం. బహిరంగంగా ఫాసిస్టునని చెప్పుకునే గ్రూపుకు చెందిన జాన్‌మేరీ లీపెన్ నేషనల్ ఫ్రంట్‌ను స్థాపించాడు. ఇప్పుడు లీపెన్ జాతీయవాదినని చెప్పుకుంటున్నాడు. యువకుడిగా ఉన్నప్పుడు లీపెన్ ఫ్రెంచి సైన్యంలో పారాట్రూపర్‌గా పనిచేశాడు. ఆల్జీరియా వలసవాద సైన్యంలో ఉంటూ ప్రజలను చిత్రహింసలపాల్జేయడంలో సిద్ధహస్తుడిగా పేరుమోసాడు. తాను స్వంతంగా జాతీయవాద ముసుగులో పార్టీని పెట్టడానికి ముందు బహిరంగంగా ఫాసిస్టులమని చెప్పుకునే అనేక చిన్నచిన్న గ్రూపులు, పార్టీలలో లీపెన్ పని చేశాడు. ఫాసిస్టు కరపత్రాలను పంచిపెడుతూ ఉండేవాడు. నేషనల్

ఫ్రంట్ రాజకీయ రంగంలో ముందుకు పోయింది. జాతీయ ఎన్నికల్లో ఆ పార్టీకి 15 శాతం ఓట్లు లభించాయి. ఇవి కమ్యూనిస్టుల కన్నా ఎక్కువే. సోషలిస్టులకన్నా 4 శాతంమాత్రమే తక్కువ. (1928లో అధికారం కోసం మాత్రమే ప్రయత్నాలు ప్రారంభించిననాడు హిట్లర్‌కు వచ్చిన ఓట్లు కన్నా ఇప్పుడు లీపెన్ పార్టీకి వచ్చిన ఓట్లే అధికం) లీపెన్‌కు దాదాపు 35 శాతం ఓటర ~ నుభూతి ఉందని, మూడింట రెండు వంతుల మంది ఫ్రాన్స్‌లో పరిమితికి మించి మై . . ు ఉన్నట్లు భావిస్తున్నారని ఎన్నికలు సూచించాయి ఈ సానుభూతి పరులంతా లీపెన్‌కు ఓటు వేస్తే ఆయనే పార్లమెంటుపై అదుపు సాధించేవాడు. పశ్చిమయిరోపాలో ప్రధానంగా ఇటలీ ఆస్ట్రియా బెల్జియం, డెన్మార్క్ అన్నిటికన్నా జర్మనీలో ఈ విధమైన ఉద్యమాలు వేళ్ళూనుకున్నాయని వేరుగా చెప్పనక్కరలేదు.

భారతదేశంలోని ఫాసిస్టులు కూడా తామే సిసలైన జాతీయ వాదులమని చెప్పుకోవడం ప్రపంచ వ్యాపిత ఫాసిస్టు ధోరణిలో భాగమే అయితే ఇక్కడ జాతీయవాదం ఒక మతపరంగా చెప్పబడుతున్నది. ఇది భారతదేశ చరిత్ర గమనంలో ముఖ్యంగా ఈ శతాబ్దారంభంలో చోటుచేసుకొన్న ప్రత్యేక అంశాల ఫలితమే. అయినప్పటికీ సాధారణంగా చూస్తే ఇది ప్రపంచంలోని ఇతర దేశాలలో కన్నా భిన్నమైనదేమికాదు. ఫాసిస్టు ఉద్యమాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న జర్మనీలో నేడు 18-25 సంవత్సరాల మధ్య యువకుల్లో నిరుద్యోగం 40-50 శాతం వుంది సోవియట్ వ్యవస్థ కుప్పకూలిన ఫలితంగా ప్రజల్లో ఏర్పడిన భయాందోళనల వల్ల జిరొనోవ్స్కీ పలుకుబడి ఎలా పెరిగిందీ ఇంతకుముందు చెప్పుకున్నాము. '20 లక్షల వలస కార్మికులు, 20 లక్షల నిరుద్యోగులతో సమానమ'న్నది లీపెన్ అభిమాననినాదం. ఆ విధంగా నిరుద్యోగులను, వలసవచ్చిన వారిపైకి రెచ్చగొడుతున్నారు. ముస్లింలకు అనవసరంగా రాయితీలు ఇవ్వడం వల్లనే హిందువులు కష్టాల పాలవుతున్నారన్న భావన కల్గించడానికే. 'మైనారిటీల బుజ్జగింపు' అని ఆర్.ఎస్.ఎస్.కూడా చెబుతున్నది

పేదలు,మధ్య తరగతి ప్రజలు పడే కష్టాలను ఫాసిస్టులు ఉపయోగించుకుంటున్నారు వారి అసంతృప్తిని జాతి దురహంకార మతోన్మాద మార్గలకు మళ్ళిస్తారు. లేకపోతే దీనిని వర్గపోరాటాల బాటన నడిపించవచ్చునన్న సంగతి తెలిసిందే. ఫాసిస్టు శక్తులుప్రదర్శించే నిర్మాణ పరమైన శక్తి వాటి ప్రజా పునాది పాలక వర్గాలలో కొన్ని సెక్షన్లు మద్దతిచ్చేందుకు ఉపయోగపడతాయి. ముఖ్యంగా ఉదారవాద కేంద్రం బలహీన పడినప్పుడు అధారపడదగినదిగా లేదని పాలకవర్గాలు బావించినపుడు ఇది జరుగుతుంది. మధ్యేవాద పార్టీలు ఒక పటిష్టమైన సిద్ధాంతం అధారంగా కాకుండా, అవకాశ ధోరణులు, మరాతగాదాలు,

ప్రాంతీయ తగాదాల అధారంగా సమీకృత మయ్యే తక్కువ అభివృద్ధి చెందిన పెట్టుబడి దారీ దేశాలలో ఇది ముఖ్యంగా జరుగుతుంది. అసాధారణ పరిస్థితిలో మొత్తం పాలకవర్గం ఫాసిస్టు పార్టీ చూపే పరిష్కారాలవైపు త్వరితంగా మొగ్గు చూపుతుంది ఒకతరహా పెట్టుబడి సమీకరణ నుండి మరొకతరహా పెట్టుబడి సమీకరణకు మారినపుడు, ప్రాంతీయ ఘర్షణలు తీవ్రమైనప్పుడు, బూర్జువాపాలన చారిత్రకంగా ఆధారపడిన మధ్యేవాద సంస్థలు విచ్ఛిన్నమైనప్పుడు ఇటువంటిది జరుగుతుంది. ఉదాహరణకు ఫ్రాన్స్‌లో సోషలిస్టులు, గాలిస్టులు ఇద్దరూ సంక్షోభంలో మునిగిపోయారు. ఇటలీలో సోషలిస్టులు అంతరించారు అంతకన్నా నాటకీయంగా క్రిస్టియన్ డెమోక్రాట్లు మట్టిగరిచారు. భారతదేశంలో కూడా కాంగ్రెస్ భవిష్యత్తు అస్పష్టంగా ఉంది. కాంగ్రెస్ పార్టీని విడిచి బయటకు వచ్చిన ఏ ఒక్క నాయకుడు పటిష్టమైన ప్రత్యామ్నాయాన్ని చూపలేకపోతున్నాడు.

## ప్రత్యేకమైన నిర్మాణపరమైన అంశాలున్నాయా?

ఇదంతానిజమే. కాని కొన్ని ప్రత్యేక సమాజాలలో ఫాసిస్టు భావాల ఆవిర్భావానికి అనుకూలమైన మౌలిక, నిర్మాణాత్మక అంశాలుంటాయా? గ్రామ్‌సీ 'ప్రిజన్ నోట్ బుక్స్'లో ఫాసిజానికి సంబంధించిన భాగం ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. ఫాసిస్టు తీర్మానాన్ని ఇటలీ ప్రజలు పెద్ద సంఖ్యలో ఆమోదించడానికి ఆదేశచరిత్ర, దీర్ఘకాలిక సాంస్కృతికాభివృద్ధి, ముఖ్యంగా ఇటలీలో పెట్టుబడిదారీ అభివృద్ధి స్వభావంలో కారణభూతమైన అంశాలున్నాయా అని ఆయన పరిశీలించారు.

ఇప్పటి వరకు నేను ప్రస్తుత ఫాసిస్టు ఉద్యమాల గురించే ప్రస్తావించాను. భారతదేశంలో జరుగుతున్నది ప్రపంచ వ్యాపిత ధోరణిలో భాగమని చెప్పడానికే అలా చేశాను. ఆయన కాలం నాటి ఇటలీ ఫాసిజం గురించి గ్రామ్‌సీ చెప్పిన దానిని చూపటానికి ముందు నేను మరొక అంశాన్ని పునరుద్ఘాటించదలిచాను. ఫాసిస్టు ఉద్యమ రూపం ఆనాటి చరిత్రపైనా ఆదేశ చరిత్రపైనా ఆధారపడుతుంది. తమ కాలం నాటి పరిస్థితులను అధ్యయనం చేసిన మార్క్సిస్టుల రచనలు ఇప్పుడు మనకు ఉపయోగపడతాయి. రెడీమేడ్ పరిష్కారాలను చూపకపోయినప్పటికీ సరియైన ప్రశ్నలు అడగటానికి దోహదపడతాయి. గ్రామ్‌సీ ఇటలీ అనుభవం గురించి ఏమి చెప్పిందీ ఈ దృష్టితోనే చూద్దాము.

భారతదేశ పరిస్థితిని గమనంలో ఉంచుకొని చూసినప్పుడు ఇటలీ అనుభవం ఎంతో ఆసక్తికరమైనది. ఆనాటి రోమ్ ఇటలీ ఫాసిజం అభివృద్ధిలో ఎటువంటి పాత్రను నిర్వహించిందీ గమనించాలి. ప్రాచీన కాలంలోనే రోమ్ ఐరోపా, ఉత్తర ఆఫ్రికా మధ్య ప్రాచ్యాలలోని

విస్తారమైన సామ్రాజ్యానికి కేంద్రం. ఈ సామ్రాజ్యానికి కీలక ప్రాంతం దాదాపుగా నేటి ఇటలీయే. ఈ ప్రాంతంలో సంపన్నవంతమైన నాగరికత వెల్లివిరిసింది. ఇక్కడే గొప్ప సంప్రదాయ భాష లాటిన్ ఆవిర్భవించి 17వ శతాబ్దం వరకు ఐరోపాలోను, కొన్ని ప్రాంతాలలో ఆ తర్వాత కూడా ప్రధాన బోధనా భాషగాను, అధికారిక భాషగాను కొనసాగింది. ఐరోపాలో క్రైస్తవం అధికార మతంగా ప్రవేశపెట్టబడింది రోమ్‌లోనే. కాథలిక్ ప్రపంచానికి కేంద్రంగా రోమ్ కొనసాగుతూనే ఉంది. బ్రాహ్మణవాద సంస్కృతికి చెందిన అన్ని రంగాలలో సంస్కృతీ భాషకు ఎలాంటి స్థానముందీ, చర్చికి సంబంధించిన మత, తాత్విక, పాలన, సాహిత్యపరమైన అన్ని అంశాలలోను లాటిన్ భాషకు అదే స్థానముంది.

పరిపాలించడానికి విస్తారమైన ప్రాంతం, సామ్రాజ్యవాద మతం, సంప్రదాయ బద్ధమైన భాష, ఉన్నతమైన గతం- ఈ అంశాల చుట్టూనే ఇటలీలోని సంపన్నవర్గాల మానసిక పరిస్థితి పరిభ్రమిస్తూ ఉంటుంది. ఈ 'ఉన్నతమైన గతం', 'సంప్రదాయ' బద్ధమైన సంస్కృతి' బానిస శ్రమ మీద, రైతుల ఉత్పత్తి మీద, చేతి వృత్తుల వారి కష్టం మీద ఆధారపడి ఉంది. అత్యధిక ప్రజానీకం ప్రాంతీయ భాషలలో మాట్లాడుతుండగా, సంపన్నులు మాత్రం లాటిన్ భాషను ధారాళంగా ఉపయోగించేవారు. శ్రమ ఫలితాన్ని ఎలా కాజేయాలన్న దానికి సంబంధించిన మాటలు మినహా, పాలకులు, పాలితుల మధ్య ఇతరత్రా సంభాషణలు ఉండేవికావు. సంపన్న వర్గాల ఈ రాచరిక దురహంకారం, సాంస్కృతికంగా సాధారణ ప్రజలకు దూరంగా వుండటం, మతపరమైన అభివృద్ధి నిరోధకత్వం-ఫాసిస్టు మానసిక ధోరణిని రూపొందించడంలో ప్రత్యేక అంశమని గ్రామ్ సీ నొక్కి చెప్పారు.

ఆధునిక కాలానికి పూర్వం ఆసియా, ఆఫ్రికాల నుండి ఐరోపాకు సరుకులను తెచ్చే వాణిజ్య మార్గాలన్నీ మధ్యధరా ప్రాంతంలో కలిసేవి. ఆ విధంగా ఇటలీ ఓడరేవులు అధిక ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అందువల్లనే వాణిజ్య పెట్టుబడి సృష్టించిన అన్ని సంస్కృతుల కన్నా ఇటలీలోని సంస్కృతి ఉత్కృష్టమైనదిగా ఉంది. అదే సమయంలో స్థానిక పరిశ్రమల అభివృద్ధికి ఎటువంటి ప్రోత్సాహం లేకుండా పోయింది. జాతీయ సమైక్యతను ప్రోత్సహించే అంశాలు కూడా లేకుండా పోయాయి. ప్రతి చిన్న రాజ్యం, సంస్థానం తన ఓడరేవును అక్కడి పన్నులు, సుంకాల వ్యవస్థను పరిరక్షించుకుంటూ ఉండేవి. అగ్రభాగంలో ఈ సంస్కృతి గొప్ప కళాఖండాలను, కళారక్షకులను సృష్టించింది. అట్టడుగున ఇతరుల, ఇతర ప్రాంతాల శ్రమను కాజేసే వాణిజ్యపరమైన లాభాలు పెంచుకునే పద్ధతి అమలులో ఉండేది. వాణిజ్య పెట్టుబడి అపరిమితంగా పెరిగిన ఫలితంగా పరిశ్రమలు అభివృద్ధి చెందలేదు. తేలిగ్గా లభించే లాభాల కోసం వెంపర్లాట

అధికంగా ఉండేది. అందువల్లనే పాలక వర్గాలు దీర్ఘకాలిక బూర్జువా విప్లవ పరివర్తనను సైతం చేపట్టలేకపోయాయని గ్రామ్‌సీ చెప్పారు.

వాణిజ్యపెట్టుబడి అపరిమితంగా ప్రోగుపడటం వల్లనే ఇటలీ ఐరోపా పునర్వికాసానికి పురిటిగడ్డ అయింది. ఐరోపా చరిత్ర గురించి అద్భుతంగా వివరించిన గ్రామ్‌సీ ఒకచోట ఇటలీలోని పునర్వికాసం విఫలమయిందని అభివృద్ధి నిరోధకంగా తయారయిందని చెప్పారు. జర్మనీలో పునర్వికాసం కాథలిక్ చర్చ్ ఆధిపత్యాన్ని బ్రద్దలు కొట్టిన ప్రొటెస్టంట్ పునర్నిర్మాణంతో మిళితమయి కొనసాగింది. ఇటలీలో పునర్నిర్మాణం వెనక్కి నెట్టబడింది కాథలిక్ చర్చి తన అధికారాన్ని మరింత తీవ్రతతో పునరుద్ధాటించింది. ఇంగ్లాండ్‌లో పునర్వికాసం శాస్త్రీయ సంస్కృతికి, క్రామ్‌వెల్ తిరుగుబాటు రూపంలో వ్యక్తమయిన మొదటి బూర్జువా విప్లవానికి దారి తీసిన సాధారణ ప్రజల తిరుగుబాటుకు పునాదులు వేసింది. ఇటలీలో అటువంటి పరివర్తన కాని శాస్త్రీయ భావాల వ్యాప్తి కాని జరగలేదు. గ్రామ్‌సీ ఇంకా ఇలా చెప్పారు. ఫ్రాన్స్‌లో మతపరమైన పునర్నిర్మాణం త్రిప్పికొట్టబడినప్పటికీ దాని బీజాలు ఎంతో లోతుగా ఉండిపోయాయి. మళ్ళీ అవి మొలకెత్తి పెరిగి విప్లవ రూపంలో పుష్పించాలి. ఫ్రాన్స్‌లో పునర్నిర్మాణం జర్మనీలో మాదిరిగా ప్రొటెస్టంట్ సంస్కృతిని నిర్మించలేదు. దానిని మించిపోయి సెక్యులర్ సంస్కృతిని స్థాపించింది. ఐరోపాలోనే మొదటి అధునాతన రాజవ్యవస్థకు ఫ్రాన్స్ నాంది పలికింది. కాని ఇప్పటిలా మాత్రం ప్రొటెస్టంట్ పునర్నిర్మాణంగాని, సెక్యులర్ సంస్కృతి గాని ఏర్పడలేదు. ఈ విధంగా తొలి రోజుల్లో ఇటలీ మతపరమైన సంస్థల ఆధిపత్యాన్ని నిర్మూలించడలోను, శాస్త్రీయ సంస్కృతిని నిర్మించుకోవడంలోను, సెక్యులర్, ఆధునిక రాజ వ్యవస్థను ఏర్పరచుకోవడంలోను విఫలమవడం నిరంకుశమైన అహేతుకమైన రాజకీయాలకు దోహదపడిందని గ్రామ్‌సీ చెప్పారు.

# ఇటలీలో ఆలస్యంగా అభివృద్ధి

...ధునిక దేశంగా పరిణామం చెందటానికి ముందరి అంశాలను పైన మనం సంగ్రహంగా చెప్పుకున్నాము 1860వ దశకంలోగాని ఇటలీ స్వతంత్ర జాతీయ రాజ్యంగా ఏకమవలేదు. అప్పటివరకు ఇటలీ పలు స్వతంత్ర రాజ్యాలుగానే వుంది. కొన్ని ప్రాంతాలను ఆసియన్లు, ఫ్రెంచివారు, జర్మనీవారు, స్పానిష్‌వారు పాలిస్తుండేవారు. భాషాపరమయిన పరిస్థితి మరింత అధ్వాన్నంగా వుండేది. లాటిన్ భాషకు అధికార ప్రాబల్యం వుండేది మిగిలిన భాషలకు ప్రాంతీయ ప్రతిపత్తి మాత్రమే వుండేది ఇటలీ తన స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొని సమైక్య దేశంగా అవతరించినప్పుడు మొత్తం జనాభాలో రెండున్నర శాతమంది మాత్రమే ఇటలీ భాష మాట్లాడగలిగిన స్థితిలో వున్నారు. ఇటలీకి స్వాతంత్ర్యం లభించిన సుమారు ఏభై ఏళ్ళకు గ్రామ్‌సీ జన్మించాడు. ఆయన తన బాల్యంలో సార్డీనియా భాషను మాత్రమే అభ్యసించాడు. కాలేజీకి వెళ్ళిన తర్వాత మాత్రమే గ్రామ్‌సీ ఇటలీ భాషను సరిగా వ్రాయడం నేర్చుకున్నాడు ఇటలీలోని, ముఖ్యంగా దక్షిణ ప్రాంతంలోని పేద ప్రజలలో యిటువంటి పరిస్థితి వుండేది 1937లో గ్రామ్‌సీ మరణించే వరకు యిదే పరిస్థితి కొనసాగింది సామూహిక అక్షరాస్యత అమలు జరిగి, రేడియో, టి.వి.లు బహుళ ప్రచారంలోకి వచ్చిన తర్వాత మాత్రమే తమ జాతీయభాష అని చెప్పబడే ఇటలీలో అత్యధికులు మాట్లాడటం ఆరంభమయింది.

జాతీయ రాజ్యం లేదు, ఉమ్మడి భాష లేదు, చెప్పుకోతగిన పారిశ్రామిక పెట్టుబడి లేదు, భూస్వాముల ప్రయోజనాలకు కట్టుబడిన సాధారణ చర్చి మాత్రం వున్నది, వాణిజ్య వర్గాలు, వృత్తి వర్గాల మద్దతు దానికి వుంది ఈ స్థితిలో జాతీయ సమైక్యత కోసం,

సామాజిక, రాజకీయ మేధో సంస్కరణల కోసం రిసోర్జిమెంట్ అనే ఉద్యమం మొదలయింది ఫాసిస్టు మానకసిక ప్రవృత్తి, ఆరంభాన్ని గ్రామ్‌సీ ఈ మొత్తం చరిత్ర నుండి గ్రామ్‌సీ గ్రహించినప్పటికీ, ముఖ్యంగా ఈ రిసోర్జిమెంట్ ఉద్యమ వైఫల్యాల నుండే ఆయన చెప్పాడు

ఫ్రెంచి విప్లవం తర్వాత 19వ శతాబ్దంలో జాతీయ స్వాతంత్ర్యం, సాంఘిక సంస్కరణల కోసం వచ్చిన ఈ ఉద్యమం కనీసం బడా భూస్వాములకు వ్యతిరేకంగా పని చేస్తుందని, చిన్న రైతుల, జాతీయ బూర్జువాల ప్రయోజనాల కోసం బూర్జువా ప్రజాస్వామ్య పరిధిలో పనిచేస్తుందని మాత్రమే భావించగలం ఈ దృష్టితో చూసినప్పుడు ఇటలీ స్వాతంత్ర్యయోధులు విఫలమయ్యారని చెప్పుతామే తప్ప, విద్రోహులని మాత్రం చెప్పలేము. వారికి జాతీయఐక్యత అనేదే ఏకైక లక్ష్యం ఒకరకంగా అది వారికి పరమ పవిత్రమైనది. ఈ విధంగా వారు ఆ తర్వాత కాలంలో తలెత్తిన ఫాసిస్టు తరహా యుద్ధోన్మాద ప్రాంతీయ వాదానికి బీజాలువేశారు. ఆధునికీకరణ అంటే వారి దృష్టిలో అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాల నుండి ముఖ్యంగా ఫ్రాన్స్ నుండి భావాలను ఎరువు తెచ్చుకోవడం మాత్రమే కాని వారి వద్ద రైతాంగ విముక్తికోసం ఒక క్రమబద్ధమైన కార్యక్రమం ఏదీలేదు ఆస్తి ఆధారంగా వారు పరిమిత ఓటు హక్కును ప్రవేశపెట్టారు. వయోజన పురుషులందరికీ ఓటు హక్కుసైతం స్వాతంత్ర్యం వచ్చిన అర్థశతాబ్దానికి అంటే 1911 తర్వాతగాని లభించలేదు మహిళలకు ఓటుహక్కు ద్వితీయ ప్రపంచ సంగ్రామం అనంతరం మాత్రమే లభించింది అప్పటికి గ్రామ్‌సీ మరణించారు ప్రాంతీయ అసమానతలను సరిదిద్దే సమస్య ఆ నాయకులకు పట్టనేలేదు. సంపన్నవంతమైన ఉత్తర ప్రాంతానికే వారు అధిక ప్రాధాన్యత యిచ్చేవారు. వ్యవసాయ ప్రాంతాన్ని ఆదాయ వనరుగాను, పోలీసులు, సైనికులను రిక్రూట్ చేసుకునే ప్రాంతంగాను మాత్రమే పరిగణించేవారు

ఈ వాదనను మరింత ముందుకు తీసుకుపోవచ్చు. ఫాసిస్టు మానసిక ప్రవృత్తికి, అత్యధిక ప్రజానీకం ఫాసిజాన్ని అంగీకరించడానికి ఆధారభూతమైన అంశాలు ఇటలీలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి స్వభావంతోనే యిమిడి వున్నాయి మరింత క్లుప్తంగా చెప్పాలంటే 1920 దశకంలో ఫాసిజం ఆవిర్భావం, అర్థ శతాబ్దం క్రితం ఇటలీకి స్వతంత్ర జాతీయ ప్రతిపత్తిని మొదటిసారిగా చవిచూసిన జాతీయవాద ఉద్యమ వైఫల్యంలోనే యిమిడి వుంది. ఈ అంశాన్ని తర్వాత గ్రామ్‌సీ వ్యక్తిగత నేపధ్యం గురించి, ఫాసిజంపై ఆయన అభిప్రాయాల గురించి చెప్పుకునేటప్పుడు మరింతగా పరిశీలించవచ్చు

కొంతమంది కొమింటర్న్ కామ్రేడ్స్ చెబుతున్న విధంగా పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభాన్ని

పరిష్కరించేందుకు ఫైనాన్స్ పెట్టుబడి జరిపే చివరి ప్రయత్నమే ఫాసిజం అని గ్రామ్‌సీ భావించలేదు అయన ఫాసిజాన్ని సమగ్రంగా విశ్లేషించారు. ఆర్థిక సమస్యలను ఆయన సాంస్కృతిక, మత, మొత్తం వక్రీకరణకు గురైన జాతీయతా అభివృద్ధి చరిత్రతో అనుసంధించారు వర్గాలతో నిమిత్తం లేకుండా, సాధారణ ప్రజలతో సహా అత్యధిక జనం ఫాసిజాన్ని ఎందుకు అంగీకరించారన్నదే అయన వేసిన ప్రధానమైన ప్రశ్న. దీనికి సమాధానాన్ని కనుగొనేందుకై అయన తన వ్యక్తిగత అనుభవాన్ని, మేధో సంపత్తిని వినియోగించారు

దక్షిణ ఇటలీలోని అర్థఫ్యూడల్ జీవనం, అత్యధిక గ్రామీణ ప్రజలు గ్రామ్‌సీకి బాగా సన్నిహితం కాలేజీలో ఆయన సాహిత్యం, భాషాతత్వ శాస్త్రం, చారిత్రిక భాషాశాస్త్రం అభ్యసించారు. ఈ అంశాలలో తన పరిజ్ఞానాన్ని అయన ఇటలీలోని ఆధునికవాద, భవిష్యత్‌వాద ఉద్యమాలపై విలువైన విమర్శలు చేయడానికి మాత్రమే పరిమితం చేయలేదు మొత్తం సమాజంమీద సంపన్న వర్గాలు మేధోపరమైన పెత్తనాన్ని సాధించేందుకు సాంస్కృతిక, భాషాపరమైన భేదాలను ఎలా వినియోగించింది విశ్లేషంచడానికి కూడా వాడారు 1917 అక్టోబరు విప్లవం తర్వాత పాశ్చాత్య ప్రపంచంలోనే అతి పెద్ద కార్మికవర్గ తిరుగుబాటు రెండు "అరుణ సంవత్సరాలు" 1918, 1919లో గ్రామ్‌సీ కీలకమైన నాయకుడుగా అభివృద్ధి చెందాడు 1921లో గ్రామ్‌సీ 30ఏళ్ళ వయస్సులో ఇటలీ కమ్యూనిస్టు పార్టీని స్థాపించిన అర్గురు నాయకత్వంలో ఒకరిగా వున్నారు ఆ తర్వాత ఐదేళ్ళు అయన మాస్కోలో ఇటలీ కమ్యూనిస్టు పార్టీ కొమింటర్న్ ప్రతినిధిగా వున్నారు. ఇటలీకి తిరిగి వచ్చిన తర్వాత పార్టీ ప్రధాన కార్యదర్శిగాను, పార్లమెంటులో కమ్యూనిస్టు పార్టీ సభ్యునిగాను వున్నారు 1926లో ఆయనను ఫాసిస్టులు జైలులో పెట్టారు. ఫాసిజంపై గ్రామ్‌సీ అభిప్రాయాలు తెలుసుకునేందుకు ప్రధాన ఆధారంగా వున్న "ప్రిజన్ నోట్‌బుక్స్' ' అయన జైలులో వుండగానే రచించారు. దారుణమైన బాధల మధ్య, ఫాసిస్టులు పసిగడతారేమోనన్న ఆందోళన మధ్య 1929-1935 మధ్య కాలంలో అయన వీటి వ్రాశారు. ఆ తర్వాత రెండేళ్ళు అయన ఏమీ వ్రాయలేనంతగా జబ్బుపడ్డారు. 1927లో గ్రామ్‌సీకి జైలుశిక్ష విధిస్తూ ఫాసిస్టు జడ్జి"ఈమేధస్సు పదేళ్ళపాటు పనిచేయరాదు"అని ప్రకటించారు. అలాగే గ్రామ్‌సీ ఖచ్చితంగా పదేళ్ళలో ఫాసిస్టు జైలులోనే, జైలుశిక్ష ముగిసిన మరుసటి రోజే మరణించారు కాని అయన మేధస్సు పనిచేయడం నిలిచిపోలేదు. గ్రామ్‌సీ "ప్రిజన్ నోట్‌బుక్స్" ప్రపంచంలోనే ఈ శతాబ్ది మేటి రచన.

ఇక్కడ మనం గ్రామ్‌సీ జీవితం గురించి అయన పెరిగిన దేశం ప్రధాన పరిస్థితుల

గురించి క్లుప్తంగా తెలుసుకుందాం. ఆ తర్వాత ఫాసిజంపై ఆయన రచనల గురించి సంగ్రహంగా చెప్పుకుందాం

## గ్రామ్‌సీ జీవితం

ఇటలీ 1870లో పూర్తి స్వతంత్ర్య, సమైక్య దేశంగా అవతరించింది. ఇటలీ దక్షిణ తీర ప్రాంతానికి సమీపంలో వున్న సార్డీనియా ద్వీపంలోని ఒక చిన్న గ్రామంలో 1891లో గ్రామ్‌సీ జన్మించారు గ్రామ్‌సీ తల్లి అదే ప్రాంతానికి చెందిన వనిత ఆమె చిన్న రైతు కుటుంబానికి చెందినది మొత్తం జనాభాలో పదిశాతం, అందునా మహిళలలో ఒక శాతం మాత్రమే అక్షరాస్యులుగా వున్న ఆ ప్రాంతంలో చక్కగా చదవడం, వ్రాయడం తెలిసిన అసాధారణ మహిళ ఆమె రాజకీయ కుట్ర కారణంగా తండ్రి అరెస్టుకు గురికావడంతో గ్రామ్‌సీ కుటుంబం కష్టాల్లో చిక్కుకుంది గ్రామ్‌సీ తల్లి తన ఏడుగురు సంతానాన్ని కుట్టుపని చేస్తూ పోషించింది ఒక మోస్తరు పట్టణంలో పెరిగిన గ్రామ్‌సీ పైకి ఎదగటంలో విఫలమైన పెటీ బూర్జువా కుటుంబానికి చెందినవాడు.

గ్రామ్‌సీ విద్యుత్ సౌకర్యంలేని, కనీసం లాంతరు కూడాలేని ఇంటిలో పెరిగాడు సరిపోయినంత తిండి వుండేదికాదు కాలేజీకి వెళ్ళేటప్పుడు తరచు ఆకలి బాధకు గురయ్యేవాడు నాలుగేళ్ళ ప్రాయంలో ప్రమాదానికి గురైన ఫలితంగా ఆయనకు మూర్ఛలుకూడా వచ్చేవి. తెలిసీ తెలియని డాక్టరు వద్దకు వెళ్ళితే పిల్లవాడిని తల్లక్రిందులుగా వ్రేలాడదీస్తే సరి అవుతుందని చెప్పాడు. కాని ఈ చికిత్స ఆయన జీవితాన్నే దుర్భరం చేసింది గూని వచ్చి తరచు భరించశక్యంకాని నొప్పికి జీవితాంతం గురయ్యారు మూఢ నమ్మకాలు తీవ్రంగా ప్రబలి వున్న ఆ ప్రాంతంలో గ్రామ్‌సీ ఈ పరిస్థితికి రావడానికి కారణం అతీతశక్తులే అని అంతా విశ్వసించారు. తోటి విద్యార్థులు గూనివాడు అని గేలి చేస్తూ రాళ్ళు రువ్వి తరిమేవారు.

పరిణతి చెందిన గ్రామ్‌సీ గ్రామీణ జీవితాన్ని రంగుల్లో చిత్రించలేదు. సార్డీనియా గ్రామీణ జీవితంలో క్రూరమైన అంశాలను చెప్పారు శతాబ్దాల తరబడి సాగిన విదేశీ దురాక్రమణలు, బందిపోటు సైన్యాలు, ఫ్యూడల్ దోపిడీ రైతు జీవనంపై క్రూరమైన ముద్రవేశాయి పిల్లలను, మహిళలను చెడుగా చూపడం ఆ క్రూరత్వంలో భాగమేనని ఆయన భావించారు. దారిద్ర్యం, అనారోగ్యం. నిరుద్యోగం, అంతులేని ఆకలి బాధ రైతుల మానసిక ప్రవృత్తిని బీభత్స పూరితం చేశాయని ఆయన తలచారు భూత వైద్యాలు, మూఢ నమ్మకాలు వీటిన్నింటిపై కాథలిక్ ఛాందసవాదం కూడా పెనవేసుకొని పోయింది ఈ స్థితిలో ఫాసిజంతో సహా, నియంతృత్వ పాలనా పద్ధతులు చోటు చేసుకోవడం అత్యధికులకు

ఆశ్చర్యం కల్గించలేదు. సంక్షోభాన్ని విప్లవకర పద్ధతిలో పరిష్కరించకపోతే రైతాంగ సెక్షన్లు ముఖ్యంగా మధ్య తరగతి రైతాంగం ఫాసిస్టు పతాకం క్రింద తేలిగ్గా సమీకరించబడతాయి ఈ విషయంలో రైతాంగ సమస్య విప్లవకర పద్ధతుల్లో గతంలా పరిష్కరించబడకపోయిన ప్రభావం కనిపించింది

గ్రామ్‌సీ మేధాశక్తి చిన్నతనంలోనే వెల్లడయింది అయితే అయన విద్యాభ్యాసం పేదరికం కారణంగా అర్ధంతరంగా నిలిచిపోయింది. ప్రతి సబ్జెక్టులోను నూటికి నూరు శాతం మార్కులు సంపాదించిన తాను డబ్బులేక స్కూలుకు వెళ్లడం ఆపివేయవలసి రాగా తనకన్నా తక్కువ మార్కులు వచ్చిన సంపన్నుల బిడ్డలు పై చదువులు చదువుతున్న పరిస్థితిని గమనించిన తనలో ఆనాడే తిరుగుబాటుతత్వం ఆరంభమైందని గ్రామ్‌సీ ఆ తర్వాత వ్రాశారు రెండేళ్ళ విరామం తర్వాత గ్రామ్‌సీ మళ్ళీ స్కూలుకు వెళ్ళాడు. అయితే అక్కడి బోధనా విధానం ఆయనకు ఏమాత్రం నచ్చలేదు లెక్కలంటే చిన్నప్పటి నుండి ఉన్న మక్కువ ఆయనకు లేకుండా చేసింది ఆ విద్య. స్కూలు విద్య ముగియనున్నదనగా ఆయనకు రఫాగార్జియా అనే టీచరుతో పరిచయమేర్పడింది. రాజకీయాల గురించి, జాతుల అణచివేత గురించి గ్రామ్‌సీకి ఆయన కొంత వివరించారు "యుద్ధాలు వాణిజ్యం కోసం జరిగాయి తప్ప, సాంస్కృతిక వ్యాప్తి కోసంకాదు" నల్లమందును అమ్ముకోవడానికి బ్రిటన్ చైనాలోని ఎన్ని పట్టణాలపై బాంబుల వర్షం కురిపించింది "ఇదంతా నాగరికతను అభివృద్ధి చేయడానికేనా?" అన్న అంశాలను గ్రామ్‌సీకి ఆ టీచరు చెప్పారు.

తన స్వంత ద్వీపమైన సార్డీనియాను, ఇటలీ దక్షిణ ప్రాంతాన్ని సంపన్నవంతమైన ఉత్తర ప్రాంతంపైన ఎన్ని రకాలుగా ఆధారపడేలా చేసిందీ గమనిస్తున్న గ్రామ్‌సీకి జాతుల అణచివేత గురించి అవగాహన చేసుకోవడం ఎంతో తేలికయింది. సార్డీనియా చరిత్రలో వివిధ సమయాల్లో ఐరోపాలోని వివిధ రాజ్యాల ఆక్రమణలో వుంటూ వచ్చింది స్వాతంత్ర్యం లభించి, ఇటలీలో విలీనమైన తర్వాత ఉత్తర ప్రాంతంలోని పెట్టుబడిదారులు సార్డీనియాను అంతర్గత వలసగా మాత్రమే పరిగణించారు 1911లో గ్రామ్‌సీ పై చదువుల కోసం ఇటలీ ప్రధాన భూభాగంలోకి వెళ్ళారు. సార్డీనియా పారిశ్రామికరంగం అని చెప్పబడే గనుల్లో కేవలం 35 వేల మంది పనిచేస్తున్నారు. వీరిలో సగం మంది ఉత్తర ఇటలీ, ఫ్రెంచి, బెల్జియం పెట్టుబడిదారులు నిర్వహిస్తున్న గనుల్లోనే పనిచేస్తున్నారు. గ్రామ్‌సీ అల్స్ అనే గ్రామంలో పెరిగాడు కుటుంబ శ్రమపై ఆధారపడిన చిన్న తరహా సరుకుల రంగం, లాభసాటిగా వుండని అతి చిన్న వ్యవసాయ కమతాలు కల్గిన ప్రాంతాలకు ఆ గ్రామం ఒక నమూనా రైతులపై పన్నుల భారం అధికంగా వుండేది. ఇటలీ, బెల్జియం, ఫ్రాన్స్

ప్రభుత్వాలు ఈ రేట్లను నిర్ణయిస్తూ వుండేవి.

ఆ తర్వాత గ్రామ్‌సీ కుటుంబం సార్డీనియాలోని ఏకైక రైలు మార్గం సమీపంలోని ఘిలార్జా పట్టణానికి తరలి వెళ్ళింది. అక్కడకూడా అభివృద్ధి లేమి ఒకేరకంగా వుంది సార్డీనియాలో ఫ్యూడలిజం 1835లో మాత్రమే తొలగించబడింది. అప్పటికి ఒక్క రష్యాలో తప్ప ఐరోపాలో ప్రతిచోట ఫ్యూడలిజం అంతమయింది. సార్డీనియాలో కొన్ని ప్రాంతాలలో చిన్న చిన్న రైతు కమతాలు వుండగా, మరికొన్ని ప్రాంతాలలో భూస్వాముల ఆధీనంలోని భారీ క్షేత్రాలు వుండేవి పేద రైతులు అర్థ ఫ్యూడల్ బంధనాలలో వుండేవారు దారిద్ర్యం తీవ్రంగా వుండేది. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో నిర్బంధ సైనిక విధానం అమలులోకి వచ్చినప్పుడు రైతాంగంలోని నాల్గవ వంతు మంది సైనికులుగా పనికిరాలేదు తీవ్రమైన పౌష్టికాహార లోపమే దీనికి కారణం. గని కార్మికులు 10 గంటల పనిని కోరేందుకు, నెలకు రెండు రోజులు సెలవు అడిగేందుకు సైతం జంకేవారు. యాజమాన్యాల నుండి దారుణమైన అణచివేతకు, శిక్షలకు, హత్యలకు సైతం గురికావలసి వస్తుందన్న భయమే దీనికి కారణం

## వర్గ దృక్పథం

గ్రామ్‌సీకి చిన్ననాడే ఇదంతా తెలుసు. అయితే దానిని వర్గ దృష్టితో కాకుండా, ఇటలీ ఉత్తర ప్రాంతం విదేశీ శక్తులతో కలిసి దక్షిణ ప్రాంతంపై జరిపే జాతి అణచివేత అని మాత్రమే ఆయన భావించారు ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం ఇటలీ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ముఖ్యుడైన టోగ్లియాట్టి కూడా సార్డీనియాకు చెందినవాడే అయితే ఆయన మధ్య తరగతి నుండివచ్చారు. కళాశాలలో ఆయన గ్రామ్‌సీ సహాధ్యాయి కూడా. గ్రామ్‌సీని తాను తొలుత కలుసుకున్నప్పుడు ఆయనలో కొన్ని అస్పష్టమైన భావాలు వుండేవని, అయితే అయన తీవ్రమైన జాతీయవాదిగా వుండేవాడని, ఉత్తరాదిపై నిప్పులు గ్రక్కుతూ వుండేవాడని. సార్డీనియాకు, ఇటలీ దక్షిణ ప్రాంతానికి విముక్తి లభించాలని గాఢంగా కోరుతూ వుండేవాడని టోగ్లియాట్టి చెప్పారు కాని ఆ తర్వాత గ్రామ్‌సీ ట్యురిన్ కార్మికవర్గ పోరాటాలలోపాల్గొన్న తర్వాత తన సార్డీనియా జాతీయ వాదాన్ని విడనాడాడు. కొన్ని సంవత్సరాలపాటు [illegible] అభివృద్ధితో ప్రాంతీయ అసమానతలు పెరగటం గురించి పట్టించుకోలేదు దేశవ్యాపితంగా ఫాసిజం తీవ్రగతిన అభివృద్ధి చెందటాన్ని వివిధ ప్రాంతాలలో స్థావరాలను ఏర్పరుచుకోవడాన్ని గమనించిన తర్వాత, సోవియట్ యూనియన్‌లో కొంత కాలం గడిపినప్పుడు లెనిన్

గ్రంధాలను, ఇతర బోల్షివిక్ సిద్ధాంతవేత్తల గ్రంధాలను మొదటిసారిగా అధ్యయనం చేసిన తరువాత మాత్రమే అయన ఇప్పుడు చెప్పబడుతున్న దక్షిణాదిసమస్యకు తిరిగి వచ్చాడు.

ఈ సమస్య గురించిన గ్రామ్‌సీ అవగాహన అప్పటికి మరింత సంక్లిష్టంగా మారింది. ఇటలీలోని వివిధ ప్రాంతాలు వివిధ రకాలైన చరిత్ర కలిగినవని, వర్గాల స్వరూపం, వర్గ పోరాటాల తీరుపై వీటి ప్రభావం వుంటుందన్న అవగాహనకు అయనవచ్చారు. అందువల్ల కమ్యూనిస్టులు దేశవ్యాపిత సమైక్య పోరాట పరిధిలోనే అయినప్పటికీ వివిధ ప్రాంతాలకు, వివిధ రకాలైన విధానాలను రూపొందించుకోవాలని అయన కోరారు. రెండవది ఇటలీ లాంటి అర్థ పారిశ్రామిక దేశంలో, కమ్యూనిస్టు విప్లవం ఫాసిజానికి వ్యతిరేకంగా జాతీయ పోరాటంగాని,రైతాంగాన్ని విప్లవకర సమీకరణలోకి తీసుకురాకుండా, ప్రాంతీయ సమస్యను సరియైన రీతిలో పరిష్కరించకుండా సాధ్యంకాదని అయన దృఢంగా విశ్వసించారు ఉత్తరాది నగరాలలోని ఉద్యమ స్థావరాలు గ్రామీణ మద్దతు లేకపోవడంతో తేలిగ్గా ధ్వంసం చేయబడిన విషయాన్ని గమనించిన తర్వాత ఆయనలో ఈ అవగాహన మరింత తీవ్రతరమయింది కమ్యూనిస్టు పార్టీ తన శక్తి సామర్థ్యాలను అత్యధికంగా రాజకీయ ఉపాంగంపైనే కేంద్రీకరించడం, ఫాసిజానికి పార్లమెంటరీ ప్రతిపక్షాన్ని రూపొందించడంతో మాత్రమే నిమగ్నమవటం, సంస్కరణవాద బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటానికే పరిమితం కావడం. రైతాంగాన్ని విప్లవకరరీతిలో సం[illegible]రిచడానికి తగినంత శక్తిని కేటాయించకపోవడం ఫాసిజం విజయం సాధించడానికి ఒక ప్రధాన కారణమని ఆయన చెప్పారు.

ఈ అసమతుల్యత ఎత్తుగడలపంధాలో మార్పులు లాంటి పైపై పరిష్కారాలతోనే సరయ్యేది కాదని ఆయన భావించారు పార్టీ అనుసరించిన మొత్తం వ్యూహాత్మక వైఖరిని యిది పూర్తిగా ప్రతిబింబిస్తున్నదని అయన అభిప్రాయపడ్డారు క్లుప్తంగా చెప్పాలంటే గతంలో రైతాంగంలో విప్లవకర కార్యాచరణ నిర్వహించనందువల్లే యిప్పుడు రాజకీయ ఉపాంగంపై అధికంగా కేంద్రీకరిస్తున్నాము సంక్షోభం ముదిరిన తర్వాత యిటువంటి కార్యకలాపాలకు సమయం దాదాపు ముగిసిపోయింది 1926లో ఫాసిజం అధికారాన్ని హస్తగతం చేసుకొని నాలుగేళ్ళు ముగిసిన తర్వాత, గ్రామ్‌సీ అరెస్టయ్యారు అప్పటికే ఆయన 'దక్షిణాది సమస్య' అనే ఈ అంశంపై అసమతుల్యతను సరిచేసేందుకు అధ్యయనం చేస్తూనే వున్నారు ఫాసిస్టు మూకలు ఆయనను అరెస్టుచేసే సమయానికి, ఇటలీ పార్టీ ఎదుర్కొనే సమస్యలపై ఆయన చేస్తున్న అధ్యయనం కొనసాగింపు 'ప్రిజన్

నోట్‌బుక్స్‌లో మనకు కనిపిస్తుంది

## మత సమస్య

మత సమస్యను గ్రామ్‌సీ మూడు భాగాలుగా విభజించారు. వ్యావసాయిక దక్షిణాదిలో పోప్, మతాధిపతుల వ్యవస్థాగత అధికారానికి, ఫ్యూడల్ వారసత్వం, కొనసాగుతున్న భూస్వామ్య ప్రాబల్యం. సాంప్రదాయతను ఎడనాడినప్పటికీ, ఆధునికంగాగాని, పారిశ్రామిక వంతంగా గాని మారకుండా వున్న సమాజంలో మధ్య తరగతి వర్గాలలో మూఢ విశ్వాసాలు కారణమని గ్రామ్‌సీ భావించారు. పారిశ్రామిక వంతమైన ఉత్తరాదిన ఆధునిక మేధావుల్లో మత భావాల ప్రభావానికి గ్రామ్‌సీ వేరే కారణం వుందని చెప్పారు రోమన్ సామ్రాజ్యం నుండి సంపన్న వర్గాలకు సంక్రమించిన సంప్రదాయకతా వారసత్వం, సంప్రదాయ సాహిత్యానికి సంబంధించిన లాటిన్ భాష, చర్చి, రోమన్ సామ్రాజ్యానికి చెందినవని భావించడమే అని ఆయన అన్నారు. ఆధునిక మేధావుల సైద్ధాంతిక భావనల్లో మతపరమైన అంశం మిళితమయి వుండటాన్ని బట్టివారు మధ్య యుగాల ఉత్పత్తి వ్యవస్థకు చెందినవారుగా భావించరాదని గ్రామ్‌సీ చెప్పారు వారు ఖచ్చితంగా ఆధునిక బూర్జువావర్గ మేధావులే అయితే ఆ వర్గం నిజమైన విప్లవాన్ని సాధించలేకపోయింది. అందువల్ల ఐరోపాలోని ఏ ఇతర దేశంలోకన్నా తమ సంప్రదాయకత గురించి గర్వపడే ఇటలీలో ఈ వర్గం గతానికి తమ చట్టబద్ధతను ఆపాదించుకున్నది సంప్రదాయక అలవాట్లలో మతపరమైన ముద్ర బలంగా వుండే ఏ సమాజంలోనైనా, సంప్రదాయం, వారసత్వాలను ముందుకు తెచ్చి ఆధునిక సమాజాన్ని ఆ పునాదిపై నిర్మించాలని ప్రయత్నిస్తే, అది అనివార్యంగా అభివృద్ధి నిరోధక, నిరంకుశ మతపోకడలకు దారితీస్తుందని గ్రామ్‌సీ చెప్పారు

మతం ఒక ప్రపంచ దృక్పథం, అణగారిన వర్గాల లౌకికజ్ఞానం అన్న మూడవ అంశాన్ని కూడా గ్రామ్‌సీ చెప్పారు ప్రపంచం గురించిన సమగ్రమైన కార్మికవర్గ దృక్పథం బలపడనంత వరకు, అన్నిరకాల సామాజిక కార్యాచరణకు పునాది ఏర్పడనంత వరకు, అణగారిన వర్గాలు తమ పరిస్థితుల గురించి, పోరాటాల గురించి అవగాహన ఏర్పరచుకోవడంలో మతం అత్యంత శక్తివంతమైన పాత్ర వహిస్తుంది మతపరమైన 'లౌకిక జ్ఞానం' నుండి సమగ్ర కార్మికవర్గ దృక్పధానికి పరివర్తన చెందే దశలో అన్నిరకాలయిన సైద్ధాంతిక పోరాటాలు జరుగుతాయి కాని యిది ప్రధానంగా నూతన సమాజ నిర్మాణానికి సంబంధించింది మాత్రమే.

పెట్టుబడిదారీ పూర్వదశ వరకు వున్న సంస్థాగత అధికారం, ఆధునిక మేధావుల్లో

సైద్ధాంతిక పరమైన స్థానం, జనబాహుళ్యంలో లౌకిక జ్ఞానం - మతానికి సంబంధించిన ఈ మూడు అంశాలను విశ్లేషణ కోసం మాత్రమే వేరు చేయగలమని గ్రామ్‌సీ చెప్పారు. వాస్తవ జీవితంలో ఈ మూడు అంశాలు ఒకదానితో మరొకటి మిళితమయి వుంటాయి. జనబాహుళ్యపు మతపరమైన భావాలనుండి వారి నిజమైన స్థితిగతులను అర్థం చేసుకోవడం కష్టం. ఎందువల్లనంటే మతమనేది ఎల్లప్పుడూ సంపన్నవర్గాల ఆధీనంలోనే వుంటుంది. అయినప్పటికీ జనంలో వుండే మతాచారాలను కేవలం చర్చి, మతాధిపతుల ప్రాబల్యంగానే పరిగణించరాదు. తరచూ అవి వాస్తవ పోరాటాలకు ప్రతిబింబంగా వుంటాయి. అదే సమయంలో జనం ఆచరించే మతం ఎప్పుడూ స్వతంత్రంగా వుండదు అందువల్ల గ్రామ్‌సీ చెప్పే జన సంస్కృతి, జానపద కళలు అన్నవి సంపన్నవర్గాల సంస్కృతి, కళలకు పూర్తి విరుద్ధమైనవిగావు జన సంస్కృతి అనేది గ్రామ్‌సీ దృష్టిలో ఒక కలగూరగంప. స్వేచ్ఛకోసం ప్రజలు జరిపే పోరాటాన్ని అది ప్రతిబింబిస్తుంది. అదే సమయంలో అటువంటి స్వేచ్ఛను ప్రస్తుత సామాజిక పరిస్థితిలో సాధించుకోలేకపోవడాన్ని కూడా తెలుపుతుంది స్వేచ్ఛ కోసమై జరిపే పోరాటం సైతం వక్రీకరణలకు గురవుతుంది. ఏ విలువలకైతే వారు వ్యతిరేకంగా పోరాడుతున్నారో ఆ విలువలు సైతం అందులో చోటు చేసుకుంటాయి

## ఫాసిజం అనే అంశం సంక్లిష్టమైంది

పైన పేర్కొన్న విషయాలకు ఫాసిజానికి సంబంధం ఏమిటి? మొదటిగా ఫాసిజంఅనేది పెట్టుబడిదారీ అభివృద్ధి చరిత్రలో ఒక బిందువు వద్ద ఆర్థిక సంక్షోభాలను పరిష్కరించే వర్గ రాజకీయాలు, విధానంలాగానే, అది ఒక సాంస్కృతిక, సామాజిక అంశం అని కూడా గ్రామ్‌సీ భావించారు రెండవది, పాలక వర్గ విధానమే అయినప్పటికీ జన బాహుళ్యంలో అత్యధికులు ఫాసిజాన్ని ఎలా అంగీకరించారన్నదికూడా ఒక అంశం కొన్నిరకాలయిన భావాలను సిద్ధాంతాలను మాత్రమే ప్రజలు ఎందుకు అంగీకరించారన్న విషయంలోనే గ్రామ్‌సీ చారిత్రిక వారసత్వం, సాంస్కృతిక భావాలు అన్న అంశాలను తీసుకున్నారు. రెండవ ప్రపంచ మహాసభ సందర్భంగా లెనిన్ ఇటలీ కమ్యూనిస్టుల నుద్దేశించి మాట్లాడుతూ 'విప్లవాలు సన్నద్ధం చేయబడతాయి' 'మీరు విత్తని పంటను కోసుకోవాలని చూస్తున్నారు' అని అన్నారు. మితవాద సంప్రదాయకత, బూర్జువా జాతీయవాదుల వైఫల్యాలు, ఫాసిస్టుల మానసిక ప్రవృత్తిని అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రాతిపదికను ఏర్పాటు చేయాలని, ఆధునిక భావాలు, జనబాహుళ్య ప్రజాస్వామ్యం పెరుగుదలను నిరోధించాలని ఆయన భావించారు

ఖచ్చితమైన ఫాసిస్టుదాడులు 1918లో ప్రారంభమయ్యాయి మొట్టమొదటి సంఘటిత ఫాసిస్టు సంస్థలు ఆమరుసటి సంవత్సరం ఏర్పడ్డాయి. 1922లో వారు రోమ్‌లో అధికారాన్ని చేజిక్కించుకున్నారు. కాగా 1913లో జరిగిన మొదటి ఎన్నికల్లోనే ఇటలీలో సోషలిస్టులు ప్రధాన పార్టీగా వచ్చారు ఆనాటి ఎన్నికల్లో వయోజన పురుషులకు మాత్రమే ఓటుహక్కుఉన్నది 1920 చివరి నాటికి సోషలిస్టులకు పార్లమెంట్‌లో మూడవ వంతు స్థానాలుండేవి 1921 లివ్రోన్ మహాసభలో సోషలిస్టుపార్టీ చీలిపోయి కమ్యూనిస్టుపార్టీ ఏర్పడింది చీలిన ఈరెండుపార్టీలకు అప్పుడు 1లక్షా 50వేల మంది కార్యకర్తలుండేవారు లిబరల్స్ చీలికలు, పీలికలుగా ఉన్నప్పటికీ మొత్తం మీద పార్లమెంట్‌లో వారికే మెజారిటీ ఉండేది ఫాసిజం ఆవిర్భావాన్ని ఇటలీ అరికట్టలేకపోయింది ఫాసిజానికిముందున్న లిబరిలిజం,సోషలిజం లాంటి వన్నీ పేకమేడల్లాకూలిపోయాయి పెద్ద సంఖ్యలొ రైతాంగం, కార్మిక వర్గంలోని కొన్ని సెక్షన్లతో సహా జనాభాలోని గణనీయమైన భాగం ఫాసిజాన్ని ఎలా అంగీకరించారు? ఇటలీలో ఫాసిస్టు పూర్వ చరిత్ర, సంస్కృతి, సమాజం గురించిన గ్రామ్‌సీ అధ్యయనమంతా ఈ ప్రశ్నకు సమాధాన మిచ్చే లక్ష్యంతోనే కొనసాగింది

ఇటలీ దక్షిణ ప్రాంతంలో వ్యవసాయ సంక్షోభం యుద్ధం ఫలితంగా మరింత తీవ్రతరమైపోయింది. ఇటువంటి ప్రాంతంలో ఫాసిస్టులకు మద్దతుఇవ్వడంలో సంఘటిత మతం ఖచ్చితమైన పాత్ర వహించింది ఫాసిస్టులు తమ కార్యకర్తలను పట్టణ ప్రాంత మధ్యతరగతి వర్గాలనుండి సమీకరించుకునేవారు వీరికి మతాధిపతుల ఆశీస్సులుండేవి ఇటువంటి ఫాసిస్టు కార్యకర్తలు క్రింది తరగతి ప్రజల నిరసనను అణచివేయడానికి బాగా ఉపయోగపడేవారు అప్పటికి రైతు లీగ్‌లు పూర్తిగా ఓడించబడ్డాయి ఫాసిస్టులు బాగా బలంపెంచుకున్న విషయాన్ని భూస్వాములు గుర్తించారు ఫాసిస్టుల ప్రాబల్యానికి అనుగుణంగా భూస్వాములు కూడా నడుచుకోవలసిన పరిస్థితి వచ్చింది ఉత్తరాదిన పట్టణ ప్రాంత మేధావుల్లోని పెద్ద సెక్షన్లు మొదట ఫాసిస్టుల పట్ల సానుభూతిని కనపరిచారు కాని మతపరమైన సంస్కృతీ వారసత్వం, సామ్రాజ్యం వారికి మితవాద సిద్ధాంతాలను సమకూర్చాయి అందువల్ల వారు అంతర్గతంగానే ప్రజాతంత్ర్య ఉద్యమానికి ముఖ్యంగా కార్మిక వర్గ ఉద్యమానికి బద్ధ వ్యతిరేకులు. రోమన్ గొప్పదనం, ఆధునిక ప్రపంచంలో ఇటలీ బృహత్తర పాత్ర లాంటి ఫాసిస్టు వాగాడంబరం పట్ల వారు సహజంగానే అనుబంధాన్ని వ్యక్తంచేశారు. ముస్సోలినీ అధికారాన్ని చేపట్టడానికి ముందు కేవలం ఒకరిద్దరు బడా బూర్జువాలు మాత్రమే ఆయనకు మద్దతునిచ్చారు ముస్సోలినీ మధ్యతరగతి వర్గాల నుండి, అలగా జనం నుండి పెద్ద మద్దతును సంపాదించుకొని తద్వారా

ప్రధానమంత్రి పదవిని చేజిక్కించుకోగలిగాడు. ఒకదాని తరువాత మరొకటిగా రాయితీలను సంపాదిస్తూ లిబరల్ కేంద్రంలోకి చొచ్చుకుపోగలిగాడు. వామపక్షాల ప్రజా ఉద్యమాలను తట్టుకొని లిబరల్ కేంద్రం విశ్వసనీయమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమయింది. ఈ స్థితిలోకొందరు పెట్టుబడిదారులు ముస్సోలినీని పరోక్షంగా వ్యతిరేకించినప్పటికీ, వామపక్ష ఉద్యమాన్ని తట్టుకోవాలంటే మొత్తం పెట్టుబడిదారులు ముస్సోలినీయే శరణ్యమన్న నిర్ణయానికి వచ్చారు. బలమైన రాజ్యాంగ యంత్రాన్ని, అధునాతన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తానన్న ముస్సోలినీ నినాదం కూడా వారికి ఆకర్షణీయంగా కనిపించింది. ప్రజలపై భీతావహ చర్యలు, నిరంకుశపాలన గురించి వారు పట్టించుకోలేదు ప్రజాస్వామ్యం, పౌరహక్కుల పట్ల పెట్టుబడిదారులకు మౌలికమైన పట్టింపులేదు

ఇటలీలో లాంఛనప్రాయమైన ప్రజాస్వామ్యం ఉన్న సమయంలో కూడా బూర్జువా పార్టీలు సిద్ధాంతాల ప్రాతిపదికన కాకుండా, వ్యక్తుల చుట్టూ మాత్రమే సమీకృతమై ఉండేవి రైతాంగంపై, కార్మిక వర్గంలోని బలహీన సెక్షన్లపైనా భీతావహం నిత్యకృత్యంగా ఉండేది. మహిళలపై అత్యాచారాలు సర్వసాధారణం (సిసిలిలో ప్రతి పదిమంది మహిళల్లో ఒకరు అత్యాచారాలకు గురైనవారే) ఫాసిజం అనేది బడా బూర్జువాల చేతగాని, భూస్వాముల చేతగాని సృష్టించబడలేదు ప్రధానంగా మధ్యతరగతి వర్గాలు, వ్యాపారస్తుల చేత ఇది సృష్టించబడింది మధ్యేవాద శక్తులు తమలోతాము కొట్లాడుకుంటూ రూపొందించలేకపోయిన బలమైన రాజ్యాంగ యంత్రాంగాన్ని ఫాసిస్టులు సమకూరుస్తారని విశ్వసించిన సంపన్నవర్గాలు ఫాసిజం సామాజిక రాజకీయ ఆధిపత్యాన్ని వెనువెంటనే ఆమోదించాయి.

## బూర్జువా వర్గ వైఫల్యం

ఇటలీ స్వాతంత్ర్యాన్ని పొంది ఏకీకరణను సాధించిన తర్వాత ఏభై ఏళ్ళకు ఫాసిజం విజయం సాధించింది? స్వేచ్ఛ గురించి గొప్పలు చెప్పుకునే బూర్జువావర్గం ప్రజాస్వామ్యం ఒక ప్రహసనంగా మారి దిగజారి, నిర్మూలించబడటాన్ని చూస్తూ ఉండటం మినహా ఎందుకు అడ్డుకోలేకపోయింది? దీనికి గ్రామ్సీ ఇచ్చిన సమాధానం సంక్షిప్తమైంది అయితే రెండుకీలక అంశాలు చెప్పవచ్చు బూర్జువావర్గం రైతాంగంతో పొత్తుపెట్టుకొని భూస్వామ్య వర్గాన్ని నిర్మూలించడంలో విఫలం కావడం ఒక అంశం బూర్జువా వర్గం సంప్రదాయకత అనేభావాన్నికల్గిఉండడం, గ్రామీణ అభివృద్ధి నిరోధక శక్తులతో సఖ్యతకల్గిఉండడం ఫలితంగా సంఘటిత మతం యొక్క అధికారాన్ని



74770

కూలద్రోయలేకపోవడం రెండవ అంశం గ్రామీణ సమాజం ఆధిక్యత కల్గిన చోట ప్రజాతంత్ర సమస్యఅనేది ఖచ్చితంగా వ్యవసాయక సమస్యే రైతాంగం విప్లవకర విముక్తిని పొందిన సమాజంలో బూర్జువా రాజకీయ వ్యవస్థ ప్రజా స్వామ్యయుతంగాని, బూర్జువా స్వభావంతోగాని, నిజానికి ఒక రాజకీయ వ్యవస్థగాగాని ఉండజాలదు.

ఎందువల్ల బూర్జువావర్గం భయపడిపోయి, రైతాంగంతో కాకుండా భూస్వాములతో పొత్తుపెట్టుకుంది? గ్రామ్‌సీ ఈ క్రింది కీలకమైన అంశం దానికి కారణమని చెప్పారు 1789లో ఫ్రెంచి బూర్జువా వర్గం విప్లవాన్ని సాధించే సమయంలో రాచరిక వర్గానికి వ్యతిరేకంగా కార్మికులతోను, రైతాంగంతోను పొత్తుపెట్టుకున్నది అయితే శ్రామిక జనావళిని సమీకరించితే రాచరిక వ్యతిరేక విప్లవం అనివార్యంగా పెట్టుబడిదారీ వ్యతిరేక విప్లవంగా మారిపోతుందని బూర్జువా వర్గం వెనువెంటనే గ్రహించింది. ఫ్రెంచి బూర్జువా వర్గం ప్రజలుపాలుపంచుకునే రాజకీయ విభాగాలను భీతావహచర్యలతో ధ్వంసం చేసింది ఆతర్వాత దశాబ్దాలలో ప్రపంచంలోని బూర్జువావర్గమంతా రైతాంగ శక్తిని అరికట్టడానికి రాచరికంతో కలిసి పనిచేయడం నేర్చుకుంది. ప్రపంచంలో మొట్టమొదటి కార్మికవర్గ విప్లవం 'పారిస్ కమ్యూన్' జరిగి, బూర్జువా వర్గం అభివృద్ధి నిరోధక శిబిరంలో సంపూర్ణంగా చేరిన సమయంలోనే ఇటలీకిస్వాతంత్ర్యం వచ్చింది ఇటలీ బూర్జువా వర్గం స్వాతంత్ర్యం కోసం పోరాడింది అయితే ఈపోరాటంలో భూస్వాములు, మతపరమైన అభివృద్ధి నిరోధక శక్తులతో సహా మొత్తం దేశంలోని విప్లవ ప్రతీఘాత శక్తులపై ఆధారపడింది. విప్లవకర పరివర్తన జరగలేదంటే, రైతాంగంలో అత్యధికులు దారిద్ర్యంలోను, నిరక్షరాస్యతలోనూ మునిగే ఉన్నారని మాత్రమే కాదు, పారిశ్రామికాభివృద్ధి సైతం సంపన్నవర్గాలకు మాత్రమే ఉపయోగపడే విధంగా ఆధునికీకరణకు గురవుతుందని కూడా అర్థం. ఆపరిస్థితుల్లో పట్టణాభివృద్ధి అనేది అత్యధిక నగరాలలో పారిశ్రామికీకరణ కాదు. ప్రధానంగా దళారీ బూర్జువా వర్గం ఒకవైపు, అలగాజనం మరొకవైపునా వీరిద్దరి మధ్య నిరుద్యోగులు, అరకొర ఉపాధి కల్గినవారు ఉంటారు. ఈరకమైన పునాదులపై నిజమైన ప్రజాస్వామ్యం నిర్మించబడదు కాబట్టి అలగా జనంగా దిగజారినవారు, అసంతృప్తికి గురైనవారు ఫాసిజానికి పునాదిగా ఉన్నారు. లిబరల్ డెమోక్రాట్లు ఊగిసలాడుతున్నప్పుడు పాలక వర్గాలు జనతా ప్రజాస్వామ్యం, ఫాసిజం- ఈరెండింటిలో ఏదో ఒక దానిని ఎంచుకోవలసి వచ్చింది పాలకవర్గం ఫాసిజాన్నే ఎంచుకొన్నది. ఈ క్రమంలో పాలకవర్గం సంఘటిత మతం యొక్క డిమాండ్లను కూడా ఆమోదించింది

స్వాతంత్ర్యం లభించిన తర్వాత 52ఏళ్ళకు ఇటలీలో ఫాసిజం అధికారాన్ని చేపట్టింది.

సంప్రదాయకతతోకూడిన గతం, పటిష్టమైన మతాలు కల్గిన భారత దేశం కూడా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొని మరికొన్ని సంవత్సరాలలో ఏభైఏళ్ళు పూర్తవుతుంది. సార్వత్రిక వయోజన ఓటుహక్కుపై ఆధారపడిన భారతదేశంలో రాజ్యాంగపరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో బూర్జువా జాతీయవాదులు పాత్ర నిర్వహించారు. హిందూత్వ, శివసేన ఫాసిస్టు శక్తులకు ఇదే ప్రధాన అడ్డంకిగా ఉంది. అర్థ పారిశ్రామిక దేశంలో పటిష్టమైన ప్రజాస్వామ్యం నెలకొనాలంటే గ్రామ్‌సీ అత్యవసరమని చెప్పిన రైతాంగ విప్లవ విమోచన, మతపరమైన అభివృద్ధి నిరోధక శక్తులపై సూత్రబద్ధమైన పోరాటం- ఈ రెండూ ఫాసిస్టు పూర్వ ఇటలీలో మాదిరిగానే భారతదేశంలో కూడా కనిపించవు నెలకు తలక్కొంటికి రు 46గానిర్ణయించబడిన దారిద్ర్య రేఖ ప్రకారం దేశంలో 30కోట్ల మందికి పైగా నిష్టదరిద్రులున్నారు బొంబాయి లాంటి నగరాలు త్వరితగతిన పారిశ్రామిక విధ్వంసానికి గురవుతున్నాయి శివసేన తరహాలో ఫాసిస్టు అల - ‌ౖనం ప్రాబల్యం పెరిగిపోయింది భద్రతాదళాలు, అర్థసైనిక బలగాలు రోజువారీ పాలనా వ్యవహారాలలో పాత్ర వహించడం అంతకంతకూ అధిక మవుతున్నది.

ఇటువంటి విషయాలకు మనం ఎన్నింటినైనా పేర్కొనవచ్చు ప్రజాస్వామ్య పద్ధతులన్నింటినీ త్రోసిరాజని, నిరంకుశమైన, బలమైన రాజ్యాంగ యంత్రం కోసం, సంపన్న వర్గాలు, వృత్తి వర్గాలు గతంలో ఎందుకు ఇష్టపడ్డాయో అటువంటి పరిస్థితులే నేటి భారతదేశంలో కూడా ఆందోళనకరమైనరీతిలో పెరిగిపోతున్నాయి. కాంగ్రెస్ తరహా సరళీకృత విధానాలు దేశాన్ని అంతకంతకూ అరాచకంలో ముంచివేస్తున్నాయి. ఈస్థితిలో ఫాసిస్టు శక్తులు దేశంలో క్రమశిక్షణను అమలుపర్చుతాయా?

సుందరయ్య గ్రంథాలయం
AC 74770
హైదరాబాద్-500 044.

# మతతత్వం చారిత్రిక మూలాలు

ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్

1857 నాటి సిపాయి కలహం జాతీయ తిరుగుబాటుపై కారల్ మార్క్స్ వ్యాఖ్యానిస్తూ బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో హిందూ, ముస్లిం సైనికులు ప్రదర్శించిన సమైక్యతను అభినందించారు. ఉభయ మతాలకు చెందిన సైనికులు సమైక్యంగా పోరాడి ఢిల్లీలోని సామ్రాజ్యవాదుల సింహాసనంపై మహమ్మదీయ పాలకుని కూర్చోపెట్టారని ఆయన పేర్కొన్నారు బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగే భారత స్వాతంత్ర్య పోరాటం పూర్తిగా విజయవంతవవుతుందనటానికి ప్రధానమైన యీ రెండు మతాల సమైక్యత పూర్తి హామీగా వుంటుందని కూడా మార్క్స్ చెప్పారు.

సిపాయి కలహాన్ని, జాతీయ తిరుగుబాటును మార్క్స్ కీర్తించిన దాదాపు శతాబ్దానికి భారతదేశం, ముస్లింలు అధికంగా వున్న పాకిస్తాన్‌గానూ, హిందువులు అధికంగా వున్న భారత యూనియన్‌గానూ విభజితమైంది. ఈ విభజన తరువాత ఒక మతం వారు మరొక మతం పై కనీ వినీ ఎదుగని రీతిలో దాడులు చేశారు. తత్ఫలితంగా పాకిస్తాన్‌లోని మైనారిటీ హిందువులు భారతదేశానికి వలసరాగా, భారతయూనియన్ నుంచి చెప్పుకోదగిన సంఖ్యలో మహ్మదీయులు పాకిస్తాన్‌కు శరణార్థులుగా తరలివెళ్ళారు. అంతేకాక అఖండ భరతావని నుండి ఏర్పడిన యీ రెండురాజ్యాలు పరస్పర శత్రువులుగా మారాయి బ్రిటిష్ వారు దేశాన్ని విడిచిపోతే హిందూ మహమ్మదీయ సమస్యలు సులభంగా పరిష్కరంకాగలవన్న భ్రమలను పెంచుకున్న మహాత్మాగాంధీని యీ సంఘటనలు గాయపరిచాయి

మహాత్మాగాంధీ ఇలాంటి భ్రమలను పెంచుకోవడానికి కారణం లేకపోలేదు. హిందూ మహ్మదీయ ఘర్షణలనేవి రాజకీయ ప్రయోజనాల కోసం కపటులైన బ్రిటిష్ పాలకులు కృత్రిమంగా కల్పించిన సమస్యయని జాతీయోద్యమ నాయకులు పెంచుకున్న విశ్వాసాలనే మహాత్ముడు కూడా కలిగి వున్నాడు నిర్దుష్టమైన సామాజిక, అర్థిక, రాజకీయ అంశాలు మత సమస్య తలెత్తడానికి కారణమయ్యాయని ఆయన గ్రహించలేదు. సహజంగానే బ్రిటిష్ పాలకులు దీనిని తెలివిగా ఉపయోగించుకున్నారు.

జాతీయోద్యమ పోరాట కార్యక్రమంలో హిందూ మహ్మదీయ సమస్యకు పరిష్కారం యిమిడి వున్నప్పటికీ పై విశ్వాసాల కారణంగానే మహాత్ముడుగానీ, ఆయన సహచరులు గానీ యీ సమస్యను పరిష్కరించలేని అశక్తులయ్యారు. ఈ నేపథ్యం రీత్యా మతతత్వానికీ లేదా హిందూ మహమ్మదీయ సమస్యగా పిలవబడుతున్న యీ సమస్య చారిత్రక మూలాలను పరిశీలించవలసివుంది.

## అసలు తొడగని సామాజిక విప్లవం

ఐరోపాలో ఆదిమ తెగ సమాజం అంతరించి బానిస సమాజం ఏర్పడింది. దీని స్థానాన్ని ఫ్యూడల్ వ్యవస్థ ఆక్రమించింది. తిరిగి దీని స్థానంలో నూతనమైన పెట్టుబడిదారీ వ్యవస్థ చోటుచేసుకున్నది. కాని భారతదేశంలో సామాజిక అభివృద్ధి విభిన్నమార్గంలో సాగింది ఆదిమ తెగ సమాజ స్థానంలో చోటుచేసుకున్నది బానిస సమాజం (ఐరోపాలో వలె) కాదు. కుల వ్యవస్థ. తొలిదశలో ఐరోపా బానిన సమాజ ముఖ్య లక్షణాలను కలిగి వుండి తదనంతరకాలంలో ఐరోపా ఫ్యూడలిజం యొక్క ప్రధాన లక్షణాలను యిముడ్చుకున్న సమాజమది.

ఇదే చారిత్ర నేపథ్యంలో ప్రాచీన కాలంలో రూపుదిద్దుకున్న కుల వ్యవస్థ శతాబ్దాల పాటు కొనసాగింది బానిస, ఫ్యూడల్ వ్యవస్థల పద్ధతిలో ఆర్థికాభివృద్ధి జరిగినప్పటికి కుల వ్యవస్థకు చెందిన ప్రాథమిక సామాజిక సాంస్కృతిక నిర్మాణం యధాతథంగానే వుండిపోయింది. ఇది భారతీయ సమాజానికి ఒక ప్రత్యేకతను కల్పించింది. కారల్ మార్క్స్ మాటలను ఉటంకిస్తాను. చరిత్ర మొత్తంలో భారత దేశంలో ఎలాంటి సామాజిక విప్లవాలు సంభవించలేదు. ఎప్పుడైతే ఐరోపావాసులు (పోర్చుగీసు, డచ్, ఫ్రెంచ్, బ్రిటిష్ బూర్జువాలు) ప్రవేశించి మొదట వ్యాపారులు గాను, తరువాత సైనికులుగాను, అటు తరువాత పాలకులుగాను స్థిరపడ్డారో అప్పుడు భారతదేశంలో తొలిసారి సామాజిక విప్లవం సంభవించింది శతాబ్దాలుగా భారతదేశంలో వున్న పురాతన కుల వ్యవస్థను బ్రిటిష్ పాలకులు త్రోసి పుచ్చటం భారతదేశంలోని మొట్ట మొదటి సామాజిక విప్లవం

## ఫ్యూడల్ నాయకత్వానికి పునాదులు

ఈ కారణంచేతనే తొలినాటి స్వాతంత్రోద్యమానికి ఫ్యూడల్ పాలకవర్గాలు నాయకత్వం వహించాయి. వీరి అధికారాన్ని బ్రిటిష్ పాలకులు లాగివేశారు. ఎవరి

అధికారాలను, సంపదలను బ్రిటిష్ పాలకులు లాగివేసుకున్నారో ఆ రాజవంశీకులు, ఫ్యూడల్ ప్రభువులు 1857 నాటి మహత్తర కలహానికి, జాతీయ తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. ఆ నాటికి బూర్జువాలుగానీ, కార్మికవర్గం గానీ ఇంకా పుట్టుకురాలేదు.

19వ శతాబ్దపు చివరిలోనూ 20వ శతాబ్దపు ప్రారంభంలోనూ భారతదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు చెందిన రెండు పునాది వర్గాల ఆవిర్భావం, శతాబ్దాలనాటి కులవ్యవస్థకు చెందిన ఫ్యూడల్ సంస్కృతి సామాజిక జీవనంతో మిళితమైంది. స్వాతంత్రోద్యమంలో భాగస్వాములైన వారి అవగాహనకు, దృక్పథానికి నిర్దుష్టమైన పరిమితులు వున్నాయి. వీరిలో చాలా వరకు, మధ్య యుగాలలో మత భావాలతో కలగలసిన కులవ్యవస్థతో ప్రభావితమయ్యారు. హిందువులు-హిందూయేతరులు, అగ్రకులాలు- నిమ్నకులాలు, ఒక కులానికి వ్యతిరేకంగా మరో కులం, ఇదీ భారతీయులలో వున్న అనాటి సామాజిక-రాజకీయ స్వభావం.

## మౌలిక దృక్పథాలలో తేడా

వాస్తవానికిది స్వాతంత్ర్యానికి సంబంధించి హిందూ-ముస్లిం దృక్పథాలను ప్రభావితం చేసింది. స్వేచ్ఛా భారతంలో "మౌర్య, గుప్త, హర్ష సామ్రాజ్య వైభవం" పునరుద్ధరింపబడుతుందని హిందువులు భావించారు. ఇదేవిధంగా మహమ్మదీయులు ఢిల్లీ సుల్తాన్‌లు, మొఘల్‌సామ్రాజ్యం గురించి కలలుగన్నారు. సిక్కులు, క్రైస్తవులు, హిందువులలోని అగ్ర, నిమ్న కులాలకు చెందినవారు స్వాతంత్ర్యానంతర భారతదేశ రూపు రేఖలను గురించి తమ స్వీయ దృక్పధాన్ని కలిగివున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమూ, ఆ తరువాత భారత రాజకీయాలలో మతత్వానికి చారిత్రక మూలం ఇదే.

భారత జాతీయోద్యమానికి చెందిన తొలితరం వీరులు భారత్‌ను ఒక జాతిగాను, బ్రిటిష్ పాలకుల నుండి అది విముక్తి కావాలని నిస్సందేహంగా భావించారు. కనుకనే వారు అధునికార్థంలో భావాత్మకంగా లౌకిక ప్రజాతంత్రవాదులు, పాదార్థికంగాకులం, మతం తదితరమైన వాటిచేత ప్రభావితులైనవారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నవారు, నాయకులు ఏదో ఒక మతానికి లేదా హిందూమతానికి, గిరిజన సమాజానికి చెందినవారు తత్సంబంధిత కులము, మతము యొక్క ప్రత్యేకత స్వాతంత్ర్యం గురించి వారి దృక్పథాన్ని రూపుదిద్దింది. మహమ్మదీయులకు ప్రత్యేక ఎన్నికలను మొట్టమొదటిగా ప్రవేశ పెట్టిన బ్రిటిష్ పాలకులు యీ పరిస్థితిని చక్కగా వినియోగించుకున్నారు. ఇతర తరగతులకు చెందిన ప్రజల మత, కుల, గిరిజన భావాలను కూడా బ్రిటిష్ పాలకులు ఇదేవిధంగా ఉపయోగించుకున్నారు.

ఈవిధంగానే 1930లో జరిగిన మొట్టమొదటి రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ (దీనిని కాంగ్రెస్ బహిష్కరించింది) హాలులో స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ చేసే డిమాండ్‌కు వ్యతిరేకంగా కుల, మత తదితర ప్రతినిధులను బ్రిటిష్ పాలకులు సమీకరించగలిగారు అ తరువాత జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి కాంగ్రెస్ ఏకైక ప్రతినిధిగా మహాత్మాగాంధీ హాజరయ్యారు. ఈ సమావేశంలో కుల, మత, వేర్పాటువాద శక్తులను సమీకరించటం ద్వారా గాంధీని వంచించటంలోనే, అవమానించటంలోనూ బ్రిటిష్ పాలకులు విజయం సాధించారు భారత్‌ను విభజించి వైద్రాలగాలన్న లీగ్ డిమాండ్‌ను 40వ దశకంలో బ్రిటిష్ పాలకులు ఆమోదించటం ద్వారా యీ ధోరణి మరింత ముందుకుపోయింది.

## కాంగ్రెస్ ఎందుకు విఫలమైంది ?

బ్రిటిష్ పాలకుల ఎత్తుగడలను త్రిప్పికొట్టడంలో మహాత్మాగాంధీతోపాటు ఇతర కాంగ్రెస్ నాయకులు ఎందుకు విఫలమయ్యారు ? ఎందుకంటే సంపన్న వర్గాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాట ప్రాతిపదికపై అన్ని కులాలకు, మతాలకు, తెగలకు తదితర తరగతులకు చెందిన పీడిత ప్రజానీకాన్ని సమీకరించి సమైక్యం చేయలేని అశక్తులయ్యారు. కుల, మత తదితర విచ్ఛిన్నశక్తులకు నిజమైన ప్రత్యర్థి అన్ని కులాలకు, మతాలకు, తెగలకు తదితరాలకు చెందిన పీడిత ప్రజల సమైక్యతేనన్న విషయాన్ని బూర్జువా నాయకులుగా వారు గ్రహించలేకపోయారు కమ్యూనిస్టు పార్టీ దీనిని గ్రహించింది. వర్గపోరాటం ద్వారా యీ కుల, మత తదితర విచ్ఛిన్న శక్తులను త్రిప్పికొట్టటానికి ప్రయత్నించింది అయితే పార్టీ చాలా చిన్నది పరిణామాలను ప్రభావితం చేయలేని స్థితిలో వున్నది

ఈనాటికీ మతతత్వం యొక్క మూలాలు బూర్జువా, ఫ్యూడల్ వర్గాల పొత్తులోనే వున్నాయి. మెజారిటీ, మైనార్టీకి చెందిన మత ఛాందసుల వెనుక పాలక బూర్జువా, ఫ్యూడల్ వర్గాలు నిలిచివున్నాయి. అన్ని కులాలకు, మతాలకు చెందిన అణగారిన ప్రజానీకాన్ని పాలక, ప్రతిపక్షాలకు చెందిన బూర్జువా వర్గాలకు, వారి పార్టీలకు వ్యతిరేకంగా సంఘటితపరచడం ద్వారా మాత్రమే వారిని విజయవంతంగా నిరోధించగలుగుతాము మనదేశంలో మతతత్వ వ్యతిరేక పోరాటాన్ని, నరసింహారావు ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, జాతి వ్యతిరేక ఆర్థిక విధానాలపై సాగే పోరాటంతో మార్క్సిస్టు - లెనినిస్టులు కలపడానికి కారణం ఇదే